3-4/2015 మార్చ్ -ఏప్రియల్ -2015/2

# మాస్టర్ సి.వి.వి.

బి.ఆర్.టి.ఆర్. యోగ సమాచారము

(యోగ మిత్రులకు మాత్రమే)

గౌరవ సంపాదకులు : శ్రీ పి.ఎస్.ఆర్. శర్మ,

ఎడిటోరియల్ గైడ్ : శ్రీ రాజశేఖరుని కృష్ణమూర్తి

ఎడిటర్ : శ్రీ జానపాటి నారాయణ మూర్తి

## విషయసూచిక


| | |
|---|---|
| 1. సభ్యులకు విజ్ఞప్తి | 2 |
| 2. ప్రాసెస్ ప్రీ వ్యూ | 3-26 |
| 3. మిత్ర వాక్యములు | 27-28 |
| 4. మాస్టర్‌గారి డైరీలనుండి M.T.A సూచనలు | 29-41 |
| 5. యం.టి.ఎ. లెటర్స్ తెలుగులో | 42-48 |
| 6. ఆరు ఒప్పందాలు | 49-52 |
| 7. మా గురుదేవులు-మాస్టర్ జె.కె.యం. | 53-55 |
| 8. గ్రంథ పరిచయం | 56-59 |
| 9. ప్రత్యేక సాధన దినములు | 60 |


భ్రిక్త రహిత తారక రాజ యోగ సమాచార ద్వైమాస పత్రిక

12-118, జానపాడు రోడ్డు, పిడుగురాళ్ల యోగా స్కూలు,

**పిడుగురాళ్ళ - 522 413**, గుంటూరు జిల్లా. ఆం.ప్ర.

ఫోన్: 08649-252367, సెల్: 09849522671



## సభ్యులకు విజ్ఞప్తి

2015వ సం॥నకు సభ్యత్వ చందా - రూ.150/-

జీవిత సభ్యత్వ చందా - రూ.1500/-

చందాలను పంపగోరువారు పోస్టల్ యం.ఓ. ద్వారా పంపుచూ వారి చిరునామా తప్పనిసరిగ వ్రాయవలసినది. ఆన్‌లైన్ లో జమ చేయువారు

**SBH A/C No:62203042790, J.Narayana Murthy**

**IFSC code No: SBHY0020815**

**లో జమచేసి మాకు వారి అడ్రసు తెలియ చేయవలసినది. లేనిచో ఎవరు జమచేసినది గమనించుట కష్టము.**

**ఎడిటర్**

**జె.నారాయణమూర్తి**

అడ్రస్ :

**J. Narayana Murthy, Cell: 98495 22671,**
**12-118, Janapadu Road, Piduguralla - 522 413,**
**Guntur Dist., A.P.**

మీకు నిరంతరాయముగ పత్రిక పంపబడుచున్నది. సభ్యత్వ చందాను పంపనివారికి కూడా ఇప్పటివరకు పత్రిక పంపబడుచున్నది. మీ అడ్రస్ వద్ద 2015 అని లేనట్లయితే మీరు రెన్యువల్ చేయనట్లే. సభ్యులు కాదలచినవారు దయచేసి సభ్యత్వ చందాను పంపి పత్రిక మనుగడకు సహకరించవలసినది.

ప్రచురణ : పిడుగురాళ్ళ యోగా స్కూల్,
12-118, పిడుగురాళ్ళ-522413
గుంటూర్ జిల్లా
ఆంధ్రప్రదేశ్
ప్రింటర్ అండ్ పబ్లిషర్ : జానపాటి నారాయణమూర్తి, M.sc.
సెల్ నెం: 91 98 495 22671
12-118, పిడుగురాళ్ళ-522413
ప్రచురణ స్థలం : పిరమిడ్ ప్రింటర్స్ & బైండర్స్,15-229/2 - పిడుగురాళ్ళ

# ప్రాసెస్ ప్రీ వ్యూ
## లగ్న ఎడ్జస్ట్‌మెంట్స్
## (రాశి కోర్స్)

### రాశి చక్రము - ఆధ్యాత్మికత

యం.యన్. గారి శిష్యులయిన శ్రీదిడుగు గోపాలకృష్ణమూర్తిగారు వద్దకు, మరికొంతమంది గురజాల పరిసర ప్రాంతం వారివద్దకు మాస్టరుసి.వి.వి.గారి వ్యక్తిగత డైరీలు కొన్ని చేరాయి. వాటిని వారి ధర్మ పత్ని కులపతి ఎక్కిరాల కృష్ణమాచారిగారికి అందచేసిరి. వాటిని, "ఎసోటెరిక్ ఎస్ట్రాలజీ" లాంటి మరికొన్ని ఆంగ్ల గ్రంధములను పరిశోధన చేసి కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య గారు "spiritual Astrology"అనే ఆంగ్ల గ్రంధమును వ్రాసిరి. దానిని శ్రీమాన్ వేదాంతం ఆనందాచార్య గారు తెలుగులో "జ్యోతిర్వేదము" అనుపేర అనువదించిరి. కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య గారు ఈ సందర్భములో మాట్లాడుతూ ఈ"spiritual Astrology"ని నేను వ్రాయలేదు, మాస్టర్‌సి.వి.వి.గారు వ్రాసారు, అదేవిధంగా "జ్యోతిర్వేదం" ను ఆనందాచార్యులవారు వ్రాయలేదు, నేను వ్రాసాను అని అన్నారు. ఆ గ్రంధము నుండి మన ఈ రాశి చక్రమనే అధ్యాయమునకు అవసరమైన విషయములను సేకరించి ఈ క్రింది విధముగా కూర్చడమయినది. ఇందులో ఎక్కువ వివరణ "ఎసోటెరిక్ ఎస్ట్రాలజీ" నుండియే గ్రహించినట్లు కనబడుచున్నది.

రాశిచక్రము అనగా ఒక హద్దులుగల ఆవరణ. దాని కేంద్రము చుట్టూ ఉన్న అస్థిత్వ రాశిని 12 భాగములు చేయగా ఏర్పడిన12 విభాగములు. 12 రాశుల విభాగములకు "మేషము" నుండి "మీనము" వరకు నామకరణము చేసిరి. ఒక్కొక్కరాశికి ప్రత్యేకమైన సాంకేతిక ఆకృతి, ప్రత్యేక లక్షణములు ఉన్నవి. అదేవిధముగా జన్మరాశి నుండి



ఈ పన్నెండు రాశులకు 12 విధముల లక్షణములు ఉన్నవి. అనగా ఒక జాతకునకు ఈ రెండు విధముల లక్షణములు వర్తించును. ఇప్పటి వరకు జాతకునికి ఈ రాశి విభజననునసరించి ప్రాపంచికముగ కొన్నిలక్షణములు జన్మతః ఉండువాటిని పరిశీలించాము.

ప్రతి మానవునకు ఒక జన్మలో తను నిర్వర్తించవలసిన కార్యక్రమమును రాశిచక్రము సూచించును. ఆరాశిచక్రప్రకారము అతని జీవన ప్రక్రియ నడచును. ఈ జీవన ప్రక్రియ అంతరముగా అతని ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు ఉండు కార్యక్రమము కూడా నిగూఢమై ఉండును. జీవన ప్రక్రియ, ఆధ్యాత్మక ఉన్నతి అనునవి రెండు భాగములు.

రాశిచక్రములోని 12 రాశులుయోగోపకరణములని జ్యోతిర్వేదము ప్రతిపాదించుచున్నది. ఈ రాశి విభజననుసరించి ఈ రాశుల లక్షణములు జాతకునకు ఏవిధమైన ఆధ్యాత్మికతను అలవరచును అనే విషయములను మనము పరిశీలించవలయును.

మేష, వృషభ, మిధునరాశులుయోగోపకరములై సాధకుని విశుద్ధి కేంద్రము వరకు పరివ్యాప్తములై ఉన్నవి. ఈసందర్భమున సాధకుడు తన శ్వాసను, మనస్సును బుద్ధిని సంయమన పరచిన ఆ రాశులు సాధకుని ప్రాణశరీరమును పునర్నిర్మించును.

### మేషరాశి

మేషరాశి చాల వరకు అన్ని సంప్రదాయములలో రాశి చక్రములో మొదటి రాశిగా సూచించబడినది. "రెండు కొమ్ములుగల గొర్రెతల" ఈ రాశి చిహ్నము. ఈ రాశి వర్ణము ఎరుపు. మానవుని శిరస్సు నందు ఈ రాశియొుక్క స్థానము. నర్థాల ప్రపంచము కాని స్థూలదేహముకాని పరిణామము చెందవలయునన్న దానికి ఆధారమయిన అరూప స్థితిలో దాగి ఉన్న బీజతత్వములు ఆధారము. అట్టి బీజ పరమాణువులను విచ్ఛేదనము చేయగల బీభత్సకర మహాశక్తి ఈ రాశిలోని

ద్రవ్యరాశి యందు కలదు. ఈ రాశి విస్ఫోటన వ్యాప్తిని, కార్యాచరణను, పూర్వ రూపములను విధ్వంసమొనర్చి అంతకంటే మెరుగైన సమున్నత స్థితిలో తిరిగి అమర్చుటకు కావలసిన చొరవ ఈ రాశి ఇవ్వగలదు. ఒక జీవము తన రూపనిర్మాణక్రమములో ఈ రాశిలోనికి వచ్చినతరువాత ఈ రాశి ప్రభావమువలన తనతో వచ్చిన జీవాణువులను విచ్ఛిన్నమొనర్చుకొని, ఆ విచ్ఛిన్నమువలన మహాశక్తిని ఉద్భవింపచేసుకొని, తనలోని అత్యంత సూక్ష్మతత్వములను మరల ఆ శక్తిలో నిమజ్జనముచేసి దివ్య ప్రయోజనములను పొందుటకు అనువైన అవయవ నిర్మాణమును చేసుకొనును. ఈ కార్యక్రమములో మేషరాశిలోని తన అంశలఐక్యత, ఇతరఅంశలతో అనుసంధానతను ఏర్పరచుకొనును.

కనుబొమలు, ముక్కు కలిపి మేషరాశి చిహ్నముగ ధ్యానించవలయును. విశ్వావరణనుండి మానవునిలోనికి దిగివచ్చు వెలుగు మార్గములుగా మేషచిహ్నము సూచించును. ఇవి రెండూ సౌర, చంద్ర ప్రజ్ఞామార్గములు అయిన ఇడ-పింగళ అను రెండు నాడులుగా సూచించబడును. ఈ రెండునూ ప్రాణమయ, ఆకాశద్రవ్యమయములైన నాడులు. రాశి చక్రమునందు రెండు విభిన్న దశామార్గములు దర్శనీయములగుచున్నవి. వీనిని అధ్యయనము చేయుట యోగసాధకునకు మిక్కిలి అవసరము. అందొకటి భూగ్రహ చలనమార్గము. ఇది మేషమునుండి వృషభరాశిమీదుగా మలచబడిన ప్రదక్షిణమార్గము. రెండవది ఇది మేషమునుండి మీనము మీదుగా తిరుగు అప్రదక్షిణ మార్గము. మొదటిది పంచభూతములలోని పృథ్వీభూతమునకు చెందిన మార్గము. రెండవది జలభూతమునకు సంబంధించిన ఆత్మపథము. మానవుడు ఈ రెండు మార్గముల మధ్యనున్న మేషమునందు తన ప్రజ్ఞను నిలిపి తన ఆధ్యాత్మిక ఉన్నతిని పొందవలయును.

మేషరాశిలో జన్మించినవారు ఎక్కువగా మార్పు వైపుకు ప్రయాణిస్తూ ఉంటారు. ప్రస్తుతము నడుస్తున్న ధోరణి వైపు వారు మొగ్గు చూపరు. వీళ్ళు క్రమ పరిణామమును అధిగమించుచు తక్షణ మార్పులను కోరుకొనెదరు.



## వృషభరాశి

రాశులలో ఇది మొదటి స్థిర రాశి. దీనిని పృధ్వీతత్వ రాశి అనినారు. దీని వర్ణము నీలము. మన దేహములో మెడకు పైన ఉన్న దేహభాగము వృషభరాశియొక్క అధీనములో ఉన్నది. వాక్కును గాని రూపమును గాని ఈ రాశి వ్యక్తస్థితికి తెచ్చును. అన్నింటి కంటే సౌందర్యమయినది దివ్యగుణము. అట్టి దివ్యగుణము ఈ రాశిలో జన్మించిన జాతకుల ద్వారా వ్యక్త మగును. తమ జీవిత సర్వస్వమును ధారపోసిన కళా తపస్వులు ఈ ప్రపంచమున ఉన్నారు. అట్టివారు తమ కళయందు పరమార్ధమును దర్శించుచూ శాశ్వత సౌందర్యానుభూతిని ఆశ్వాదించుచూ ఆనందమయకోశమున ప్రతి క్షణము మేల్కొనుచున్నారు. అట్టి కళాజీవుల సౌందర్యానుభూతిపై ఈ వృషభరాశి ఆధిపత్యము వహించుచున్నది. వారు ఈ విశ్వమునందు కళయొక్క దివ్యప్రయోజనమును శోధించుటకు ప్రయత్నించుచున్నారు. కృష్ణభగవానుని జన్మ లగ్నము వృషభము.

సాధకుని ఆధ్యాత్మిక రహస్య ద్వారములను తెరచి విస్తృత మొనర్చుటకు కావలసిన శక్తివంతమైన తాళపుచెవి వృషభ జన్మలగ్న జాతకులకు ఇవ్వబడును. సాధకుడు మృదువుగా కన్నులు మూసుకొని పవిత్రమైన దివ్య మంత్రమును జపించుచూ తనలోని మూడవకన్ను ద్వారా అంతరాంతరములను దర్శించుటకు ప్రయత్నించునపుడు తన కంఠనాదము ప్రణవ నాదమున సంలీనమై దివ్యానుభూతిని అనుభవించును.

ఈరాశి యొక్క ఆధిపత్యములో ఏడు ముఖ్య యోగ సాధనా కేంద్రములు మరి కొన్ని యోగ సాధనా కేంద్రములు ఉన్నవి. సాధకునిలో ఉన్న ఈ ఏడు కేంద్రములకు విశ్వమూలమునగల కృత్తికా తారలకు మధ్య గురువుచే సరాసరి అనుగుణ్య సంబంధమును ఏర్పరచబడును. వాటినుండి సాధకుడు తనకు అవసరమైన దివ్యామృతమును దివ్యమాతృకలుగ తల్లినుండి స్తన్యమును గ్రోలినట్లు అమృతపానము

చేయవీలగును. మెడకు పైన ఉన్న వెన్నెముక భాగములోని కొన్ని గ్రంధులు ఆ అమృతమును తమనుండి క్రింది లెవెల్స్‌కు స్రవింపచేయును. నిరంతర సాధన, గురు సాన్నిధ్యము, గురువుయొక్క ఆశీస్సుల వలన సాధకుని అర్హత పెరిగి, పైన చెప్పిన ప్రేరణ జరిగి సాధకుడు యోగానందమును పొందును.

భోగము, తృప్తి, సుఖము, సంతోషము, ఆనందము ఈ రాశి వారి లక్షణములు. నిరంతర కృషి ఈ రాశివారి స్వభావము. రాజయోగ సాధకుడు తన ప్రజ్ఞను విశ్వాతీతకక్ష్యయందు నిలుపుటకు ఈ లక్షణములను చక్కగా వినియోగించుకొనును.

వృషభరాశి అధోలోకవు ప్రతినిధిగా వృచ్చికరాశి ఉన్నది. వృషభము ఆత్మ వ్యక్తీకరణను సూచించుచుండగా వృశ్చికరాశి జననేంద్రియములను సూచించుచన్నది. వృషభరాశి లక్ష్మీదేవిని హృదయమున నిల్పిన శ్రీమహావిష్ణువుకు సంకేతము. ప్రతి పురుషడు తన హృదయమందు కొద్దియో, గొప్పయో స్త్రీతత్వమును కలిగి ఉన్నాడు. వృశ్చికరాశి లక్షణమును దీనికి విలోమములో ఉండును. వృశ్చికరాశి స్త్రీ హీదయములోని పురుషతత్వమునకు ప్రతీక.

వృషభరాశిలోని కృత్తికా మండలము తపోకేంద్రమయిన ముఖము వంటిది. ఆ కృత్తికా మండలముతో సాధకుడు తన ప్రజ్ఞను అనుసంధించిన "విశ్వకుండలిని యొక్క అగ్నియోగ విధానము" సమస్తము పూర్తియగుచున్నది. ఈ విధానమునే "విశ్వాగ్నియోగము" అని పిలిచెదరు. దీనికి "స్వయంభువాగ్ని" అని పేరుకూడా కలదు.

## మిధునరాశి

మిధునరాశి మొదటి ద్విస్వభావరాశి. ప్రాణమయ కోశములోని స్పందన క్రియపై ఇది ఆధివత్యము వహించి ఉన్నది. మిధునరాశి మానవ ద్వయముగ నుండును. మీనము మరియొక ద్విస్వభావ రాశి. ఇది రెండు మత్యములు ఒకదానికొకటి ఎదురెదురుగా ఉండును.



మిధునము విరుద్ధశక్తులకు కారణమగుచుండగా మీనము వైరుధ్యములను అంతమొందించుటకు హేతువగుచున్నది. మిధునరాశి మానసరాశి. మనస్సు తనచే గ్రహించబడిన అనుభూతిని రెండు భాగములుగా విభజించి విశ్లేషించు సామర్థ్యము ఈరాశి ఇచ్చును. మంచి చెడ్డల వివేచన ఈ రాశిజులకు చాల ఎక్కువగా ఉండును.

మిధనరాశికి చెందిన హరిత వర్ణమందు శక్తివంతమైన రోగనివారక తత్వమున్నది. కర్కాటకరాశికి చెందిన ముదురుఆకుపచ్చ రంగుఆరోగ్యమును భంగమొనర్చును. యోగసాధకుడు మిధునరాశికి చెందిన హరిత వర్ణముతో సమ్మిళితమైన ఆత్మ వ్యక్తీకరణతోబాటుగా, తన విశుద్ధి కేంద్రముపై ధ్యానము నిలిపి, ఆ ప్రజ్ఞాస్థాయినుండి స్వస్థత చేకూర్చగల పదములనుచ్చరించవలయును. అప్పుడతడు తన సహజీవుల భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక కక్ష్యలలో రోగనివారణగావింపగలడు. ఇది మిధున, వృషభరాశుల సహాయమున నిర్వహించు ఆధ్యాత్మిక చికిత్సావద్ధతి. ఆధ్యాత్మిక సాధకుడు మౌనముగా కూడా ఇట్టి చికిత్సాపద్ధతిని అవలంబించగలడు. ప్రాణమునందును, శ్వాసయందును తన ప్రజ్ఞను నిలిపి మౌనముగా తన కటాక్షవీక్షణమునగాని, మనస్సునుండిగాని ప్రాణతరంగములను రోగిపై ప్రసరరింపచేసినప్పుడు రోగికి స్వస్థత చేకూరును. అట్లే పరిపూర్ణ యోగసాధకుని నోటినుండి వెలువడు మహదాశీర్వచనముగాని, అతని కన్నులనుండి జాలువారు రసార్ద్ర దృక్కులు దివ్యౌషధమువలె పనిచేసి రోగహరణ సమర్థములగు చున్నవి. అట్లే మిధున రాశిపై ప్రజ్ఞను నిలిపినవుడు ఉత్పన్నమైన భావతరంగములు కూడా చికిత్సా సామర్థ్యము కలిగి ఉండును.

ఈ రాశి ప్రభావముచే ఉన్నత దివ్య ప్రకృతులతోడి సంబంధము స్థాపింపబడును. మిధునరాశి జన్మలగ్నముగాగల యోగసాధకుడు సాధారణ స్థితికి భిన్నముగా అల్ప ప్రయోజనములను ఆశించని స్వార్థరహితుడుగా అతనిని తీర్చి దిద్దవచ్చును. అతడు అపౌరుషేయముగా

ఒక మంచి భావమును సృష్టించును. నలుగురికి మేలు చేయు మంచి వాక్కు అతని నోటి వెంట వెలువడును.

## కర్కాటకరాశి

కర్కాటకరాశి చిహ్నము తుమ్మెదను బోలియుండును. తుమ్మెద కొన్ని కీటకములను భ్రమరములుగా మార్చును. బీజములుగా ఉన్న ధర్మములను పొదిగి జీవులుగా మార్చు ప్రక్రియకు ఇది సంకేతము. ఖనిజప్రపంచములోని అణువులు వృక్షప్రపంచపు అణువులుగా పరిణామము చెందుట ఈ రాశిద్వారానే జరుగును. సామాన్యమానవుని ప్రవర్తన, ప్రవృత్తి, భావబీజములు, అనుభూతులు- ఇవి అన్నియు ఈ రాశియొక్క ఆధిపత్యములోనివే. మానసలోకములోని అనేకములైన పొరలు, భావవాహకశక్తి, చైతన్యములోని అజ్ఞాతమగు దిగువ పొర అయిన సబ్‌కాన్షస్ కూడా కర్కాటక రాశి ప్రభావము క్రిందకు వచ్చును. ఈ సబ్‌కాన్షస్ అనునది మనస్సుకు, ఆత్మకు మధ్యనున్న అనుబంధమును మేలుకొలుపును. మానవుడు తన మానసిక స్థాయినుండి ఆత్మస్థాయికి పరిణమించునపుడు బుద్ధిద్వారా పయనించును. మానవునకు-ప్రకృతికి మధ్య, తల్లికి-బిడ్డకు మధ్య గల సహజ అనుబంధమును ఈరాశి ప్రకోపింపచేయును. తల్లికి బిడ్డకు మధ్య అధోనాభి బంధముండును. ఇదియేబిడ్డను పెంచిపోషించెడి వాహకము. ఒకనిర్ణీత కాలక్రమము ననుసరించి తల్లి జననేంద్రియములోని అండములు ప్రచోదింపబడును. ఈవిధముగ ప్రచోదింపబడుటయు కర్కాటక రాశి లోనిదే. ఈ పొర భావనా లోకములో పనిచేయును. సూక్ష్మములయిన ఇలాంటి పొరల మూలములవలననే ప్రేతాత్మలతో సంభాషించుట జరుగుచున్నది. ఈరాశి భౌతిక దేహమును విడచిపెట్టిన ప్రేతాత్మలపై ఆధిపత్యము వహించి ఉన్నది. ఈ ప్రేతాత్మలకు ఒక లక్షణమున్నది. అవి భూమిపైకి దిగిరావలయుననియు, తన రక్త సంబంధీకులతో నిత్య సంబంధము పెట్టుకొనవలయుననియు వాఛించును. కనుక భూత ప్రేత పిశాచములు



ఈ రాశ్యాధిపత్యపరిధికి నొదుగునవి యగుచున్నవి. తల్లి గర్భములోని ఋతుక్రమము, అండకారకత్వము పూర్ణిమ అమావాస్యలబట్టి జరుగుచున్నవి. ఇవియునూ ఈరాశి కారకత్వమువలన జరుగుచున్నవి. ఇట్టి సమస్త జీవసృష్టి ప్రయోజనములను చేకూర్చుటకై చంద్రుడీరాశిపై ఆధిపత్యము వహించుచున్నాడు. జీవపదార్థముయొక్క శ్లేష్మతత్వము, రక్త ప్రసరణము ఈరాశిక్రిందకే వచ్చును.

ఈ రాశిలో అనుసరించువారు మాత్రమే ఉందురు. మార్గదర్శకులగు నాయకులుండరు. సాధకుడు గ్రహలోకముల నతిక్రమించువరకు ఈస్థితి తప్పదు. ఈ రాశి ద్వారా చాలకొద్దిమంది మాత్రమే గురువులు కాగలరు.

## సింహరాశి

సింహరాశి స్థిరరాశులలో రెండవది. క్రమబద్ధతను స్థాపించుట, దీక్షా శ్రద్ధలు, స్థిరమైన స్వభావము ఈ రాశిజులకు ఉండును. లౌకిక స్థాయిలో అధికారము కొరకు పోరాడుటను ఈరాశి సూచించును. వ్యక్తిత్వస్థాయిలో సిద్ధాంతములకొరకు, ధర్మవ్యవస్తీకరణకొరకు పోరాడు తత్వముండును.

సాధకుడైనవాడు శ్వాస-ప్రసరణాత్మక ప్రక్రియను నియంత్రించు స్పందనమీద మనస్సును నిలుపవలయును. క్రమముగా తనస్వరము మీదను, తన ఉచ్చారణకు ఆధారమైన కేంద్రము పైన ధ్యానము నిలుపుటద్వారా తనలో ఉన్న సింహరాశి ప్రవృత్తికి సహకరించిన వారగుదురు. తద్వారా సాధకుడు పైస్థాయిలకు ఉద్ధరింపబడును. ఇది చాల నిదానమైన నిపుణమైనవిధానము. యోగసాధనలో సాధకునకు ఉపకరించు ప్రధానపాత్ర సింహరాశి అదించును.

విద్యార్థి అయిన సాధకుడు తన స్వరమును సంగీతముతో శ్రుతి చేసికొనగలిగినప్పుడు అతని స్వరము దిగువ స్థాయి సింహరాశి శబ్దమునుండి కర్కాటకరాశి సంగీతమునకు, అక్కడినుండి మిధునరాశి ప్రాణనియంత్రణ స్థాయికి, అక్కడినుండి వృషభరాశి

స్థితికి ఉద్ధరించుకొనును.

మొదటి స్థాయిలో సింహరాశిని శునకమని వేదపురాణ సంకేత విద్య పేర్కొనుచున్నది. ఉత్తమస్థాయి ప్రక్రియలో అది సింహముగా చెప్పబడినది. స్వర్గమునకు నరకమునకు నడుమ గల ద్వారమువద్ద కుక్క మేల్కొని ఉండును. శునకమను తారక సింహరాశితో చిత్రమైన సంబంధము కలిగిఉన్నది. మానవుని చెవి వినలేని శబ్దములను వినగలశక్తి కుక్కలకు ఉన్నది. యోగసాధకునకు ఒక కుక్క దగ్గరలో ఉన్నచో ప్రజ్ఞ త్వరగా జాగృతమై ఉన్నతస్థాయి స్థాయి-ప్రకంపనలను త్వరగా స్వీకరించగలుగును. కనుకనే కొందరు సిద్ధులు తమచుట్టూ కుక్కలనుంచుకొందురు. సాధనలోని ఒక స్థాయిలో సాధకుడు కుక్కలను తన చుట్టుపట్లకు ఆకర్షించును. దీనికి కారణము ఆ సాధకునకు తెలియకపోవచ్చును. తనకు ఆధ్యాత్మిక మేలే కలుగవలెనన్న అతడు వాటిని తరిమివేయరాదు.

సింహరాశియొక్క ప్రేమతత్వము అనాహత చక్రపరిపరిధి లోనికి వచ్చును. సేవాతత్వము, సాటివారిపై నిరంతర ప్రేమ అనాహత చక్రలక్షణము. సామాన్యమానవులలో ఈ ప్రేమ ఆవేశాత్మక కోరికలతో కప్పబడి ఉండును. ఆవేశరహితమైన పరిశుద్ధమైన ప్రేమ ఒక్కటే ఆత్మ ప్రభోదము చేసి సరియైన గురువువద్దకు చేర్చును. <u>తన వ్యక్తిత్వము అంతమై, సామూహిక ప్రజ్ఞలో ఆత్మావిర్భావము జరుగుట అనునది అనాహత చక్రప్రక్రియ ద్వారా మాత్రమే సాధ్యపడును. ఇక్కడనే యోగ విద్యార్థి యోగసాధకుడగును.</u>

సింహరాశి ద్వారా అనాహతచక్ర స్థాయికి ఎదిగిన సాధకునకు సమ్యక్‌దృష్టి (అందరిలో తనని చూచుట, తనలో అందరినీ చూచుట లేక అందరిలో పరమాత్మను చూచుట) అలవడును. సమస్త సోదర మానవులను ఈ ప్రపంచపు దుఃఖములనుండి అతీతులుగా చేయు కోరికయే ఈ చక్రముయొక్క ప్రక్రియ. అట్టి కోరిక కలిగినప్పుడు



సాధకుడు సాటి జీవులను వారిబాధలనుండి విముక్తిని కలిగించుటలో నిమగ్నమై ఉండవలయును. శిష్యుడు ఈ పాత్రతను సాధించుకొనువరకు, గురువు మౌనముగా వేచియుండును. సేవ, రక్షణ, ప్రేమ అనునవి సింహరాశిలో నిహితము చేయబడినవి. తోటివారికి చేయూతనొసగుట అను పట్టువలన వారి ప్రజ్ఞ ఆత్మ స్థాయికి ఉద్ధరింపబడును. నమ్మకము, విశ్వాసము, గురి అనువాటి ద్వారా మాత్రమే సాధకుడు తన క్రింది స్థాయిలను అతిక్రమింపగలడు.

<u>జీవులకు పరిణామ క్రమమును అందించుటలో సాధకునిలో గల అన్ని చక్రములు (మూలాధార నుండి సహస్రారము వరకు గలవి)సాధకునకు సమ్యక్‌దృష్టిని కలిగించి అతనిని విశ్వ కేంద్రము వైపునకు ఆకర్షింపబడునట్లు చేయును. తన "ఇండివిడ్యువ్యాలిటీని'' మూసి ఉంచుటకు అవసరమైన ఏర్పాట్లు చేయబడ్డవి. ఈ విధానము వలననే జీవులు శాశ్వతముగా విశ్వావరణలోనే పరిభ్రమించవలసి వచ్చుచున్నది. విశ్వావరణను దాటి వారి ఆలోచలనలను ఎదుగనివ్వటము లేదు. అందువలననే మాస్టరుగారు విశ్వావరణలోని ఈ కేంద్రముల క్రియావిధానములను ఆపివేసి లేక ప్రక్కనపెట్టి, రాశిచక్రములోని రాశులకు నూతన క్రియావిధానములను ఏర్పరచి, ప్లానెటరీ రెగ్యులేషన్స్, నక్షత్రారెగ్యులేషన్స్ ఇచ్చి తన నూతన యోగ ప్రక్రియ అయిన ఇండివిడ్యువల్ లైన్ ను ప్రచోదనము చేసిరి. పాత విధానములో గల సూక్ష్మవిషయములను గ్రహించుట వలననే మాస్టరుగారు నూతన విధానమును ఎందుకొరకు ఏర్పాటు చేయవలసి వచ్చినది అనే విషయము అర్థమగును.</u>

## కన్యారాశి

కన్యారాశి రెండవ ద్విస్వభావరాశి. ఈ రాశికి చిహ్నము ఒక కన్య. దివ్యత్వము సూచించును. మాతృత్వము నందలి అత్యున్నత భావమునందు ప్రకటితమగు మహత్తర దివ్యత్వము కన్య యందు

సూచింపబడును. సముద్రమునుండి ఒక అల బయలుదేరినప్పుడు దానికి రూపము లేదు. అది క్రమముగా రూపమును సంతరించుకొనును. అల సారతః సముద్రము కన్న భిన్నము కాదు. కానీ స్థితి భేదముచే సముద్రము కన్న వేరుగా అగుపడుచున్నది. సముద్ర కేంద్రమున అల, రూప రహితముగా ఉండి క్రమముగా ఒడ్డును చేరు సప్పుడు అది రూపమును ధరించును. వాక్కు ప్రకటితమగుటకు ముందు కూడా అంతర్లీనముగా ఉచ్చరించువాని యందు ఉన్నది. అది భావముగా ఉండి ప్రకటిత స్థితికి వచ్చినది. అదే విధముగా సృష్టి మొత్తము అప్రకటిత స్థితిలో కన్యారాశియందు ఉన్నది. సృష్టి కన్యారాశి యందు గర్భధారణ స్థితిలో ఉన్నదని చెప్పవచ్చును. సాధకుడు అవ్యక్తముగా నున్న ఈ సృష్టి భావమును ఈ రాశి ద్వారా అనుసంధానమును పొందిన అతనిని సృష్టి మూలములకు చేర్చును. ఆత్మ జగదాత్మయందు స్థానమును పొందును. జగదాత్మ వానిని పరిపూర్ణుని చేసి జగత్పిత యొద్దకు గొనిపోవును. శ్రీరామానుజులవారు ఈ విధానమును "పురుషకారము" అనిరి. సామాన్యమానవునిగా ఉన్న వానిని పరమపురుషునిలో ఐక్యమొందించు స్థితికి ఈ రాశి ఈ విధముగా చేర్చును. సారూప్యము, సాయుజ్యము, సాలోక్యము అను మూడు సోపానముల ద్వారా సృష్టి మూలములో ఐక్యమగుటను చెప్పిరి. సాలోక్యమనగా పరమ పురుషుని చూపుతో కలిసి ఉండుట, సారూప్యమనగా పరమేశ్వరుని రూపముతో కలిసి ఉండుట, సాయుజ్యమనగా పరమ పురుషుని యందు తాను ఐక్యమగుట. (ఈ రాశి ద్వారా కూడా విశ్వకేంద్రమునకు మార్గము ఈ విధముగా ఉన్నది.)

ఈ మార్గమందలి యోగి కంఠస్వరము విశ్వపురుషుని అనుగ్రహముతో నిండి ఉండును. ఈ యోగి తన వాక్కుద్వారా గాని, కటాక్షరూపమున గాని ఆశీర్వచనము ద్వారాగాని శిష్యులను అయస్కాంతీకరించి శిష్యుల ప్రజ్ఞకు పుష్టినిచ్చి పరమ పురుషునితో



ఐక్యమొందు స్థితికి కొనిపోగలరు.

కన్యారాశి చిహ్నమైన కన్య ఒక చేత ధాన్యపు కంకిని పట్టుకొని, మరియొక చేత దీపమును పట్టుకొన్నట్లు వర్ణింపబడినది. ధాన్యరాశులను పండించుటకు మూల భావము ఈ రాశి సూచించుచున్నది. ఈ రాశి చిహ్నమందలి దీపము ఆధ్యాత్మిక జ్యోతి. ఈ జ్యోతి ఆధ్యాత్మి ప్రకాశమునకు, జ్ఞానోపదేశమునకు గుర్తు.

రాశి చక్రమున మొదట **10**రాశులు మాత్రము ఉండెడివని పెద్దలు చెప్పుదురు. కన్య, తుల, వృశ్చికములు కలిసి ఒకే రాశిగా ఉండెడివి. అది "కన్యావృశ్చికరాశి". ఈ "కన్యావృశ్చికరాశి" యందు గల ఆవరణ యందలి ద్రవ్యరాశి పరిణామక్రమములో పరిణతిని సాధించినందున అది భారవంతమైనది. అప్పుడు తులారాశి ఏర్పడి మూడు రాశులు అయినవి. ముందుగా శిశువునకు తల మాత్రమే ఏర్పడి తరువాత క్రింది భాగములు ఏర్పడుట జరుగును. అదేవిధముగా మొదట భూమి ఉత్తరార్ధ భాగము మాత్రమే ఉండినది. అది చీకటిలో ఉన్నది. దానికి ఋణధ్రువము ఏర్పడి కక్ష్యలను వేరుచేయు అయస్కాంత చక్రముగా భూమధ్యరేఖ వ్యక్తమయ్యెను. సంవత్సర సూర్యుడు భూమధ్యరేఖను రెండుమార్లు దాటవలసివచ్చెను. ఈ విధముగా కన్యావృశ్చికలను వేరుచేయుచు ఋణధ్రువమొకటి పుట్టినది. మొదట భూగోళము డొల్లగా ఉన్న అర్ధగోళము మాత్రమే. మనోమయకోశము పైనున్న లోకములో ఉత్తరార్ధగోళము మాత్రమే ఉండెడిది. అది తనచుట్టూ తాను తిరుగుచూ సూర్యునిచుట్టూ పరిభ్రమించుచున్నది. అప్పుడు దానికి ఆకర్షణ లేదు. దానికి యాక్సిస్ మాత్రమే ఉన్నది. అది అయస్కాంతీకరింపబడలేదు. అప్పుడు దాని కదలికకు పిరియాడిసిటీ లేదు. ఈ డొల్లయగు అర్ధగోళమున నాలుగవ భాగము క్రమముగా సాంద్రమయ్యెను. అప్పుడు దానికి పిరియాడిసిటీ ఏర్పడినది. ఈమార్పువలన భూమి అడుగుభాగము భారవంతమయి దాని ఇరుసు ఒరిగినది. మనోమయ లోకమున

పదార్థము పుట్టెను. దీనికారణముగా రెండు ధ్రువములు ఏర్పడినవి. భూమికి ధ్రువములు ఏర్పడక మునుపు విశుద్ధి చక్రముకలిగి ఊర్ధ్వధ్రువము మాత్రమే కలిగి ఉండెడివారు. దీనివలన మానవ ప్రజ్ఞలు భౌతిక లోకమున అవతరించిరి. అందువలననే స్త్రీ గర్భమున పిండమున వెన్నెముక పెరుగుదల శిరస్సునుండి క్రిందకు జరుగుట మనము గమనించుచున్నాము. ముందుగా ఏర్పడునది మెడ పైభాగమే. మొదటగా వ్యక్తమగునది మెడనుండి పైభాగము అగు ముఖ శిరోభాగమే. అది క్రమముగా సహస్రార, ఆజ్ఞా, విశుద్ధి కేంద్రములుగా వృద్ధి నొందును. అటు పిమ్మట ఎప్పటికో క్రింది శరీరభాగములు వృద్ధిచెందును.

భగవంతుని సృష్టి అంతయు ఏడు కక్ష్యలలో, ఏడు రంగులు, ఏడు సంగీత స్వరస్థాయిలు, ఏడు గ్రహావర్తనములు(**Rounds of planets**), ఏడు గ్రహ పరంపరాప్రక్రియలు(**planetary chains**), ఏడు మూలజాతులు (**root races**) ఈవిధమయిన సప్తసంఖ్యాక ప్రక్రియలో ఏడు కాలాంతరములలో సృష్టి వ్యక్తమగుచున్నది. అత్యుత్తమస్థాయికి చేరిన సాధకునకు ఈ కన్యారాశి సప్తవర్ణములను తనలో ఇముడ్చుకున్న శ్వేత కిరణముగా గోచరించును. అత్రి మహర్షి సప్తర్షిమండలమున ఒక తారగా నున్నాడు. ఆయనభార్య అనసూయకూడా ఒక తారగా నున్నది. ఆమె కన్యారాశి అధిపతిగా తన ప్రభావమును చంద్రునిద్వారా భూమిపై పనిచేయించుచుండును. పరమానుగ్రహపూర్ణమైన ఆమె భార్యాభర్తల సంయుక్త శక్తిని సాధకునకు ఈ రాశిద్వారా అనుగ్రహించగలదు.

చిత్రమేమనగా మానవ దేహమందుగల ఏచక్రమును కన్యా, మీన రాశుల ఆధిపత్యమున లేవు.

## తులారాశి

తులారాశి చిహ్నము త్రాసు. విశ్వము బాహ్యముగ వ్యక్తమగుటయను మహాద్భుత ప్రక్రియ యీరాశియందు ప్రకటితమగును. ఒక ఆవరణకు హద్దులు ఏర్పడవలయునన్న హద్దులవద్ద కేంద్రీకృత






ఫోర్సులు, వ్యాపకఫోర్సులు సమతుల్యము వహించిననే సమకూరును. ఈ సమతుల్యత ఈరాశివలననే జరుగును.

రూప కల్పనా క్రమములో వాయుతత్వరాశులు అత్యంత సనాతనమైనవి. ఇట్టి మొదటి సంచలనమునకు (వాయుతత్వ సంచలనమునకు) కుంభరాశి తత్వము ప్రతీకగా ఉన్నది. మొదటిది సృష్టి సంచలనము. రెండవది సృష్టి అవతరణ. మూడవది సృష్టి వ్యక్తీకరణ. ఈ సృష్టి వ్యక్తీకరణ తులారాశి తత్వము మూలమున జరుగుచున్నది.

సృష్టియొక్క ప్రారంభ స్థితినుండి సృష్టి జీవుల పరిపూర్ణతయన సుదూర స్థాయివరకు తులారాశి అస్థిత్వము ఉన్నది. మేషము మొదలు

పన్నెండు రాశుల లక్షణములు ఈ రాశి యందు ఉన్నవి. సృష్టియొక్క అధోముఖ ప్రజ్ఞ ఈ రాశిద్వారా సూచింపబడును. ఈ సూచించబడిన ప్రజ్ఞ యోగ సిద్ధుని ద్వారా <u>ఊర్ధ్వ ప్రజ్ఞయందు లీనమై పోవును. త్రాసునందలి రెండు వ్యతిరేక శక్తులను సమతూకము చేయుట అనగా రెండు వ్యతిరేక శక్తులను కేంద్రమందు లయము చేయుట. తూకము నిర్దుష్టముగ నున్నచో కేంద్రము ప్రవర్తించుచుండగా రెండు చిప్పలును నిశ్చేతనత్వములోని పోవును. మానవుని ఆధ్యాత్మిక మార్గము నందలి మొత్తము సారాంశమిదియే.</u>

సూక్ష్మ శక్తిమయ ప్రవాహములు నాడులని శాస్త్రము సంకేతించును. నాడులు రెండు విధములుగా ఉండును. విషయ గ్రహణము చేయునవి, కర్మేంద్రియములకు ఆజ్ఞను ప్రసారము చేయునవి, అని రెండు విధములు. మానవ ఆకారమును మొత్తము ఒక గోళముగా తీసుకున్న ఉత్తర, దక్షిణ దృవములు అను రెండు శక్తి ప్రవాహక కేంద్రములు ఉన్నవి. ఈ రెండు ఉత్తరమునుండి దక్షిణమునకు, దక్షిణమునుండి ఉత్తరమునకు ప్రవహించును. ఈ ప్రవాహమార్గమున పైనుండి క్రిదికి దిగివచ్చుచూ **6** నదీకేంద్రములు అయిన యం.పి.యన్. నుండి యాస్ట్రల్ వరకు గల నదుల మూలములనుండి ప్రవాహమును స్థూలమువరకు ఒకదానిలో ఇంకొదానిని కలుపుకుంటూ వచ్చినవి. ఈ ప్రవాహము ఉత్తరధ్రువమునుండి బయలు దేరి దక్షిణధ్రువము అయిన స్థూలమును చేరి స్థూలము ఏర్పడును. పరిణామ క్రమమున దక్షిణధ్రువము నుండి ఊర్ధ్వము అయిన ఉత్తర ధ్రవమునకు ఈ తులారాశి నుండే ప్రయాణించవలసి ఉన్నది. ఈ రాశి ఉత్తరదిశ లేక ఊర్ధ్వమార్గ ప్రయాణమును ప్రోత్సహించును. తులారాశి నుండి అప్రదక్షిణముగా ఎదిగి మేషరాశిని చేరుటయే పరిణామక్రమ లక్ష్యము. **12** రాశులు **6** జతలుగా బ్రహ్మరంధ్రము నుండిప్రజ్ఞామయ చక్రములుగా ఏర్పడి ఉన్నవి. అప్రదక్షిణ మార్గమున తన తనమును



పెంచుకొనుటయే యోగలక్ష్యము.

మేషమునుండి తుల వరకు రాశిచక్రమున ఇరువైపులగల మార్గము జీవవృక్షము అనబడును. మానవుడు రెండు ధ్రువములనుండి తనయొక్క తిరుగుప్రయాణమార్గము నన్వేషించును గనుక అతడు ప్రారంభ స్థాయిలో తులా రాశియందుండును. ఈ కారణము వలననే జీవ వృక్షము అతనికి తలక్రిందులుగా నున్నట్లు కనుపించును. వ్యక్త రూపములుండు శాఖలు క్రిందకు(స్థూలపదార్ధము వైపుకు) ప్రసరించుచుండగా మూలములగు వ్రేళ్ళు పైనుండును (వృక్ష వృద్ధి కారణములు అవ్యక్తముగ వేర్లుగా ఉన్నట్లు మానవ వృద్ధి కారణములు అవ్యక్త లెవెల్స్ నందు ఉండును. కానీ తన వ్యక్త స్థితికి కారణమైన బీజము యొక్క వ్యక్త స్థితి కనుమరుగైనను దాని అవ్యక్త కారణములు అవ్యక్త స్థితులలో దాగి ఉన్నవి. అవియే దాని హృదయాంతర్గత స్థితులు. ఆ హృదయాతర్గత స్థితులలో బీజము ఒక కారణము మాత్రమే. తులారాశి నుండి అప్రదక్షిణ మార్గమున మేషమును చేరుటకు ఆయారాశుల సహకారము ఉండును. మేషమును చేరినంత మాత్రమున తన ఆధ్యాత్మిక ప్రయాణము అంత్యదశకు చేరదు. అంత్యదశకు చేరుటకు రాశుల సహకారము మాత్రము ఉండును. ఈ అప్రదక్షిణమార్గములో జీవాత్మ ఒక లెవెల్ నుండి దాని పైలెవెల్‌కు ఆపైన ఆపైలెవెల్‌కు అధిరోహించుచూ రూప స్థితులను (రాశిచక్ర స్థితులను) దాటవలసి ఉన్నది.

తులారాశి రాశి చక్రమున సప్తమ రాశి. జాతకమున సప్తమ భావముతో ఇది సంబంధించి ఉండును. ఇది వివాహముద్వారా జీవితభాగస్వామిని సూచించును. జీవిత భాగస్వామితో కలిసి ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు జరుపు ఊర్ధ్వ ప్రయాణమును ఈ రాశి ప్రోత్సహించును.

రాశిచక్రము యొక్క ప్రవర్తనము అంతమైనచోట

ప్రజ్ఞాకేంద్రములలోని పద్మముల ప్రవర్తనము ప్రారంభమగును. రాజయోగ మార్గములో సాధకుడు రాశిచక్రమార్గమునుండి అతీతుడై సూర్యుని ఆత్మ యందు ప్రవేశించును. ఈసూర్యాంతర్వర్తి సమస్తవిధ సృష్టులకు అతీతుడు అని జ్యోతిర్వేదము చెప్పుచున్నది. కానీ మన యోగము సూర్యావరణయందు తృప్తి స్థానమునుండి వచ్చు ఆజ్ఞల ద్వారా ఒక రూపావరణను ఏర్పరచుకొనును అని మెరిడియన్ నామము ద్వారా తెలియుచున్నది.

## వృశ్చికరాశి

వృశ్చికరాశి రాశి చక్రమునందు ఎనిమిదవ రాశి. ఇది మూడవ స్థిరరాశి, రెండవ జలతత్వరాశి. ఇది అష్టమ భావమును సూచించును. పరబ్రహ్మ యొక్క ఉచ్ఛ్వాస, జీవుల యొక్క నిశ్వాస వలన ఈ విశ్వము ఆవిర్భవింపబడినది. ఆత్మయొక్క వెలుగు క్రమ క్రమముగా భౌతిక స్థితివరకు పతనమై అదృశ్యమగుచున్నది. "రహస్యము" అనునది ఈరాశి యొక్క కీలక పదము.

ఈ మహాకాశమందు భౌతిక పదార్థము ఒక ఖండ స్వరూపముగా మనకు అవగాహన యగును. అది ఈరాశి తత్వము. కనుక ఈ రాశియొక్క ప్రధాన తత్వము పతనము, అదృశ్యము. ఉన్నత కక్ష్యలపై, భౌతిక కక్ష్య పొరగా క్రమ్మి ఒక విధమైన ఆధిపత్యము వహించుటవలన దివ్య ప్రజ్ఞమరుగున పడుచున్నది. ఇది వృశ్చిక రాశివారికి సంబంధించిన ముఖ్యమైన కారకత్వము. ఈ రాశి ప్రభావముచే మరణము-మరణ సమయమున తెలివి కోల్పోవుట, స్పృహ తప్పుట, సంధిలక్షణములు మొదలగు అవసాన దశలు ఉత్పన్నమగుచున్నవి.

శారీరకమైన కామ వాంఛ వ్యసనముగా మారినచో మానవుడు పతనమగును. అది ఈరాశిచే జరుగుచున్నది. వృశ్చికరాశి పరమాత్మ చైతన్యము యొక్క లుప్త స్థితిని వ్యక్తీకరించుచున్నది.

కాల చక్రము ఒక అఖండ రూపములో ఉన్నది. అది యుగ



ప్రమాణములననుసరించి ఖండ రూపములను పొందినది. ఖండాతి ఖండములై అల్ప ప్రమాణములను పొందుట ఈ వృశ్చికరాశి రూపముననే జరుగుచున్నది. కాల చక్రములు చక్రభ్రమణమున పమవేగముతో తిరుగుచుండును. ఒకే విధముగ మార్పుచెందెడి కాలగతులలో సృష్టియొక్క సన్నివేశములు పునరావృతము లగుచుండును. మానవులలో స్త్రీలయందు రజోదర్శనము ఒక కాలక్రమానుగతి ననుసరించి జరుగును. సముద్రపు ఆటుపోట్లు, వరదలు, ప్రకృతి బీభత్సములు మొదలగు సన్నివేశములన్నియు వృశ్చికరాశి కారకత్వముచే నిబంధించబడుచున్నవి.

ఈ భౌతిక పరిణామ ప్రక్రియ తప్పించుకొనుటకు వీలులేని అనుభూతి. అవతారమూర్తులకే ఇది తప్పలేదు. పరిణత జ్ఞాని అయిన, ఆధ్యాత్మికవేత్త పవిత్రమైనటువంటియు, ఉత్తమమైనటువంటియు యజ్ఞములను నిర్వర్తించుట మూలముననే ఈ నాటకానుభవమును అతిక్రమించగలడు.

ఈ వృశ్చికరాశి కాలపురుషుని అష్టమ భావమగుచున్నది. అష్టమభావ జ్యోతిష సంజ్ఞ "రంధ్రము" ఈ భావము వ్యకిలోని లోపములను సూచించును. అంతేగాక అతనికి మంచి శిక్షణ నొసగి లోపమును పూరించి పరిపూర్ణత్వమును చేకూర్చును.

వృశ్చికరాశి జాతకుడు ఆధ్యాత్మిక మార్గమయిన అప్రదక్షిణ మార్గమును అనుసరించినపుడు మోక్షపథగామి అగుచున్నాడు. వైరాగ్యముచే కర్మబంధముల నతిక్రమించు మార్గము ఇంకొకటి ఉన్నది. అది వృశ్చికరాశిచే సూచించబడుచున్నది. కోరికలను త్రెంచుకొనుట, భోగభాగ్యములను పరిత్యజించి ఏకొండగుహలలోనో లేక అరణ్యములలోనో తపస్సు ఒనరించుటకై ఒంటరిగా వెళ్ళుట ఈ రాశికి సంబంధించిన కారకత్వము.

వృశ్చికరాశికి సంబంధించిన యోగసాధకులు తమ యోగ

మార్గమును ప్రపంచమునకు చాటి చెప్పరు. వానిని రహస్యముగ దాచి ఉంచెదరు. ఈ రాశికి సంబంధించిన ఆధ్యాత్మికవేత్తలు తల్లి కడుపులోని బిడ్డలవలె పెరిగి పెద్దయై, ఒరుల కంటికి కన్పడకుండ పరిపూర్ణతను సాధించెదరు. అసలు ఈ రాశ్యధిపత్యముక్రింద పరిగణింపబడు ఏ మార్పు అయినను పరుల కంటికి కన్పడదు.

ఐచ్ఛికముగా వృశ్చికరాశియందు అవతరించు మహామహులైన సాధకులు కొందరున్నారు. వారు దివ్యదేహమును అనగా దివ్య శాశ్వతాచ్ఛాదనను గ్రహించి, సహజీవులదైన్యమును అంతరింపజేసి వారికి ముక్తిని ప్రసాదించుటకై, ఆత్మాహుతి అగుచున్నారు.

ఈశాన్యమూల వృశ్చికరాశి స్థితికి చెందినది అనుటలో అనేక రహస్యములు దాగి ఉన్నవి. తులారాశి దేవతలకు అర్ధరాత్రి సమయము. ఇది ఉత్తరదిక్కున ఉన్నది. మకరము దేవతలకు సూర్యోదయము. ఇది తూర్పు దిక్కున ఉన్నది. వృశ్చికరాశి ఈశాన్యమూలయందు కలదు.

కుండలినీ శక్తియొక్క అధిష్టాన కేంద్రము వృశ్చిక రాశిలోని జ్యేష్టా నక్షత్రమునకు, ధనూరాశిలోని మూలానక్షత్రమునకు మధ్య గుర్తింపబడుచున్నది. ఈకారణముచే మూలాధార చక్రము వృశ్చికరాశి యందును, ధనూరాశియందును సంచరించుచుండును.

## ధనూరాశి

ధనూరాశి జాతకుని నవమ భావమునకు సంబంధించినది. దీనిని దివ్యప్రబోధాత్మక రాశి యందురు. సామాన్యమానవుల విషయములో సుదీర్ఘప్రయాణాలను, స్వప్నములను, ఆశయములను, స్వీయ ప్రణాళికల గుర్తింపును ఈ రాశి సూచించుచున్నది.

కానీ సాధకునికి ఇంకొక విధముగా ఉండును. అది ఉన్నత దివ్యపథముపై ఆత్మయొక్క దేవయానము అగుచున్నది. అతని స్వప్నములు దార్శనిక ప్రతిభను సూచించును. అతని ప్రణాళికలు అత్యున్నత దివ్యదృష్టి తో విశ్వ ప్రణాళిక రచనను గుర్తించును.



ఈ రాశి సంకేతముపై మనస్సును నిలిపి ధ్యానించుట వలన సాధకునిలోని ధర్మదేవత కన్ను తెరచును. మనము ఈ రాశి యొక్క నిగూఢతత్వమును దర్శించవలెనన్న శ్రద్ధాభక్తులు వినయ సంపద మిక్కిలి అవసరము. దీనిలోని దివ్యవైభవములో శతాంశమైనను వివరణాత్మకముగా చెప్పుట సాధ్యపడుటలేదు.

మనము ధనస్సును చూచుచున్నాము. దానినుండి సంధించబడిన బాణము తప్పించుకొని ఒక లక్ష్యమును తాకును. ధర్మనిష్టతో సంధించిన సాధన లక్ష్యమును చేరును. విఫలముకాదు.

ఈ రాశి వాక్కు ద్వారమున ఉన్నత కక్ష్యలోనికి దివ్య ప్రచోదనమును పొందుట అను విధానముపై ఆధిపత్యము వహించి ఉన్నది. (మనయోగములోజరుగు ఇనీసియేషన్ పద్ధతి ఈ విధానమునే సూచించును.)

ఈ ధనూరాశికి వాక్కు గర్భితమైన నాదము ఒక ప్రత్యేక సంబంధమును కల్పించుచున్నది. ఈ రాశికి సమసప్తకములో గల మిధునమునగూడ ఈ తత్వము వర్తించును. నాద తంత్రులవలె మిధునరాశి నాదవాహికగా పనిచేయును.

## మకరరాశి

మకరరాశి రాశిచక్రములో నాలుగవ చరరాశి. రాత్రికాలపు యమయాతనలనుండి బంధవిముక్తి కలిగించు బాల భాస్కరుని తేజస్సునే ఈ మకరరాశి సూచించుచున్నది. మహోన్నత కాలచక్రభ్రమణములు అనేకములు ఉన్నవని, ద్రష్టలైన ప్రాచీన ఋషులు దర్శించిరి. అందు దేవ సంవత్సరము ఒక కాల చక్రగతి. ఆ దేవతల సంవత్సరములో కూడ ఇట్టి సూర్యోదయ సన్నివేశముండును. జీవులపై ప్రత్యూష ప్రభావము అల్పమైనది కాదు. మనలో ఆత్మచైతన్యోద్దీపనము కలిగించు శక్తి ప్రత్యూషకాలమునకున్నది. ఈ విషయమును సాధారణ మేధ అందుకొనజాలదు. అసలు సూర్యకిరణములు దివ్యశక్తి పూరితములు.

అవి ఉషఃకాలమందు (సూర్యోదయానంతరము రెండు గంటల కాలము) జీవులపై వర్షింపబడును. మకర మాసము దేవతల ఉషఃకాలమును వ్యక్త పరచును. ఈ భౌతిక సృష్టికి అతీతమైన ఉన్నత దివ్యత్వము ఈరాశి యొక్క కారకత్వముతో మానవునిలో అంతర్గర్భితముగా దాగిఉన్నది.

మానవుని యందు రెండు లక్షణములు కలవు. 1. ఆత్మిక లక్షణములు, 2. భౌతిక దేహలక్షణములు. పరమేశ్వరుని సృష్టిలో విశ్వ ప్రజ్ఞ అనబడు మహత్తు పుట్టుకొనివచ్చును. ఆ మహత్తునకు భగవంతుడు ఏర్పరచిన రెండు ధ్రువములే మానవునియందు ద్విముఖ స్వభావములుగా రూపుదాల్చుచున్నవి. అందొకటి భౌతిక స్వభావము.(ఇది పరిమితమైనది). రెండవది ఆధ్యాత్మిక జీవలక్షణము. ఇది అవధి లేనిది. ఉదయభాస్కరుని కిరణములలో ఈ రెండు లక్షణములు పెనవేసుకోని ఉన్నవి. అవి దేవతా ప్రజ్ఞలను భూమిపైకి పంపి మనలను నిత్యము చైతన్యవంతులను చేసి మేల్కొలుపుచున్నవి.

ధనస్సు నుండి మీనాంతము వరకు ఉన్న నాలుగు రాశులు వెన్నెముక లోపలి రాశులు. అవి వెన్నెముక లోపలి భాగమున స్థితిని పొంది యోగ పద్మముల కక్ష్యకు చెంది ఉన్నవి. ఈ యోగ పద్మముల ప్రభావముచేతనే క్రింది దేహ భాగములు ఉత్పన్నములై మానవుని నిత్య జీవితమున ఉపయోగపడుచున్నవి. ఇవి నాలుగు ద్విముఖ స్వభావము కలిగినవి. ఈ ద్విముఖ స్వభావము మకరమునందు పరిపూర్ణ దశను అందుకొనుచున్నది.

మకరము అనుపదమును మొసలి, అని తప్పుగా అనువాదము చేయుచున్నారు. మకరము అనునది అతి పురాణ జంతువు. దానియందు అంతర్గర్భితముగా ఎన్నియో రహస్యములు ఉన్నవి. దానిది మేకతల, ముసలి శరీరము. ఇది రాక్షసుని గూర్చిన అతి పురాతన భావము. ఈ విచిత్ర జంతువు వరుణుని వాహనము. ఆ సంకేత క్రమము ఆకాశమున దాగిన శక్తులకు ప్రతీక. ఆ శక్తులకు అధినాధుడు వరుణుడు. అతని ప్రజ్ఞాకిరణములు యురేనస్ అను గ్రహము ద్వారా భూమి మీదకు దిగివచ్చును.



ఈ మకర రాశికి మరియొక సంకేతముకూడా ఉన్నది. అది ఐదు వ్రేళ్ళను చాచిన అరచేయి. అట్లు చాచిన ఈచేతిని ఆజగత్ప్రిత |Ÿɖ4 »n uṗ ǡ eTTç<Šn“ n+<ŠSǺ (**emblem of fearlessness**) మకరమున జన్మించిన, వాస్తవ యోగసాధకుడు ఈ అభయముద్ర యొక్క దివ్యత్వమును పొందగలడు. యురేనస్ రూపమున ఉన్న వరుణుని ప్రభావముచే ఇది జరుగును. సాధనద్వారా ఈ రాశిజులు ఆదేవదేవుని సామీప్యమును అందగలరు.

## కుంభరాశి

కుంభరాశి రాశిచక్రములో అత్యంత పవిత్రమైనది. నాల్గవ స్థిరరాశి. మానవునిలో నాల్గవ దివ్య కక్ష్యను స్థాపించుటలో ప్రాతినిధ్యము వహించును. మంత్రోచ్చారణచేయు సాధకునితో తదాత్మ్యమై అతనియందే అతడుగనే అయి ఈ పరావాక్కు సంకల్పముగా కీర్తించబడుచున్నది. పరమాత్మ తత్వాతీతము. కాని తత్వార్ధము వలే దర్శనీయమగుచున్నది ఏదియో అదియే పరమాత్మ. ఆ పరాస్థితికి ఒక స్థితి అని భావించిన అట్టి స్థితినే కుంభరాశి ప్రతిబింబించుచున్నది. ఈ రాశియందు రెండు శక్తులు కనుమరుగై దాగి ఉన్నవి.

రూప కల్పనా క్రమములో వాయుతత్వరాశులు అత్యంత సనాతనమైనవి. ఇట్టి మొదటి సంచలనమునకు (వాయుతత్వ సంచలనమునకు) కుంభరాశి తత్వము ప్రతీకగా ఉన్నది. మొదటిది సృష్టి సంచలనము. రెండవది సృష్టి అవతరణ. మూడవది సృష్టి వ్యక్తీకరణ. ఈ సృష్టి వ్యక్తీకరణ తులారాశి తత్వము మూలమున జరుగుచున్నది.

రాశులను లెక్కించునపుడు కుంభరాశి 11వది. ఇది ఏకాదశ భావ కారకత్వములపై (లాభ భావము) ఆధిపత్యము వహించుచున్నది. ఒకానొక ఆదర్శము వాస్తవరూపమును ధరించుట అనునది ఈరాశికి ఈభావమునకు గల కీలక సూత్రము. పరమగురు పరంపరల పరమలక్ష్యములను ఆదర్శములను వాస్తవీకరించుటలో ఏకాదశభావము యొక్కదివ్య కారకత్వము అగుచున్నది.

కుంభరాశి సాంఖ్యక బీజశక్తి 9 కి 1కి మధ్య గుర్తించబడుచున్నది. దానిని "0" అని మనము తప్పుగా అర్థము చేసుకొనుచున్నాము. ఆ సంఖ్యను గురించి విస్పష్టమైన జ్ఞానము కలిగినప్పుడు మానవుడు సృష్టికర్తయై వెలుగొందును. అంతేగాక పరమాణు గర్భ విచ్ఛేదన చేయగల సమర్థుడగును. సకల లోకములలోని సూక్ష్మ కణములు అంతులేని ఈ చోటుతో ముడివడియున్నవి. వేదములను దర్శించిన ఋషులు దీనిని పూర్ణము అని అన్నారు. పూర్ణము అనగా పూరించునది అని అర్థము. దానినుండి అదియే విడివడును. మరల అదియే మిగిలి ఉండును.

## మీనరాశి

మీనరాశి రాశిచక్రములో చివరిది. దీని సంకేతములో రెండు చేపలు ఉండును. అందు ఒకచేప ఒక దిశలోను రెండవది దానికి వ్యతిరేక దిశలోను ప్రయాణించుచున్నట్లు ఉండును. సృష్టి మొదలు క్రింది వైపునకు, దానిలోనే దాగి ఉన్న సృష్టి అంతము పైవైపునకు మళ్ళినట్లు ఉండి ఈ చాప ద్వయము యొక్క అభిముఖత్వములను సూచించును. ఇది సృష్టి ప్రారంభమును. అంత్యమును ఒకేచోట సూచించున్నట్లుగా ఉండును.

వెలుగు అనగా రెండు ప్రచోదనాశక్తుల సమ్మేళనము. మరియొక విధముగా సృష్టి తుది మొదళ్ళే ఆచోదనా శక్తులగుచున్నవి. మానవునిలో నిత్యము కాలగతి వ్యక్తమగుచుండును. వెలుగులతో క్రిందికి దిగి వచ్చుట,(ఎపితీలియల్ - ఉలాన్‌ల కలయికతో సమూహత్వమును గ్రహించుట) వెలుగుల విసర్జనతో పైకి వెళ్ళుట అను దివ్య ప్రయాణమునకు ఈ రాశి మార్గమును వ్యక్తపరచుచున్నది.

మానవుడు పరిపూర్ణ దశకు పరిణమించు ఉచ్ఛస్థితిని కుంభరాశి సూచించుచున్నది. మానవుడు బ్రహ్మమే అగు చరమ స్థితిని ఈ మీనరాశి వ్యక్త పరచుచున్నది.

మకరరాశిలో ఉన్నతిని సాధించిన మానవుడు తన సహజీవుల



మధ్యఉండును. మీనరాశియందు మరియొక విధము కన్పించును. స్వర్గధామమందు పరమేశ్వరునితో ఐక్యమై మానవుడు మనుచుండును. ఇవి రెండునూ రెండు మార్గములు. ఈరెండుమార్గములు ఈ రాశి సాధకునిలో సంగమించును.

ఒక శక్తి అంతర్ముఖము అగుట అనగా కేంద్రమవైపునకు ప్రయాణించుట. ఇది కేంద్రము వైపునకు ప్రయాణించి కేంద్రముతో సంలీనమగును. రెండవది బహిర్ముఖశక్తి. ఇది కేంద్రమునుండి వెలుపలికి కిరణములతో ప్రసారమగును. ఈ రెంటి లక్ష్యము ఒకటియే. తన ప్రాలాంగ్‌ను పూర్తిచేసుకొనుట. ఈ రెండు విషయములను సూచించి మార్గమును చూపునదియే మీనరాశి.

కర్కాటకము అనగా భౌతిక మరణము, వృశ్చికము మానసిక మరణము, మీనము అట్లుకాదు. ఆధ్యాత్మిక పథమున, దివ్యశక్తి మూలమున మరణమును తప్పించుకొనుట, ఈ రాశియొక్క విధానమగుచున్నది. కనుక చిరంజీవత్వములోని రహస్యము ఈ రాశియందు దాగి ఉన్నది.

మీనరాశి ఒక నిశ్చల సమాధి స్థితిని సూచించుచున్నది. ఈ రాశిచే ప్రభావితుడైన సాధకుడుగాని, ఈ రాశియే జన్మలగ్నమైన సాధకుడు తన కన్నులమూలమున పరమేశ్వరానుగ్రహమును సంపాదింపగలడు. తన దృష్టి ద్వారా అనుగ్రహదృష్టిని ప్రసరింపచేసి దివ్యాశీస్సులను అందజేయుట ఈ రాశికి చెందిన సాధకునకు అనుగ్రహింపబడును.

యోగసాధకుడు నిద్రావస్థలోనే శిక్షణను పొందును. విభిన్న శాస్త్ర వివరణలను అతడు గ్రహించగలడు. చైతన్య స్థితియందున్నప్పటి కంటే నిద్రావస్థయందు పొందిన శిక్షణ మిక్కిలి సమర్థనీయమగుచున్నది. మీనరాశి సాధకులకు ఈ విధమైన శిక్షణావకాశము కలదు.

మిగతా . . . . . . మా రాబోవు సంచికలో

# మిత్ర వాక్యములు

♦ సాంఘిక స్వభావము (కలుపుగోలుతనము) కర్మయోగమునకు మిక్కిలి అనుగుణ్యమైనది. కానీ ధ్యానయోగాభ్యాసికది గొప్ప ఆటంక మైనది. చెరుపును కలిగించును. మనోవ్యాకులతను కలిగించును. నీ మనశ్శాంతికి భంగమును కలిగించును. పలువిధముల నీ మనో నిశ్చలతను చెరచెడు స్నేహితుల నాహ్వానించుచుండును.

♦ రజ తమో గుణము లెల్లప్పుడును ధ్యాన నిష్ఠకు అంతరాయములను కలిగించుటకై యత్నించుచుండును. భగవధ్యాన నిష్ఠాసమయమున సత్వ గుణాధిక్యతచే శాంతముగ నుండు మానసము, యెక్కువ రజోగుణ ప్రవేశము కాగనే కంపనమునొందినదై గజగజ వణికిపోవును. సంకల్పములు లెక్కకు మిక్కుటమై మనోచంచలత హెచ్చిపోవును. క్రియలను ప్రేరేపించు కోర్కెలు వెలువడును. అట్టి క్రియాచరణలకై ఉపాయములు కుట్రాలోచనలు ఆరంభమగును. అట్టి సందర్భమున కొంతకాలము వరకు విశ్రమించి (శ్రమ తీర్చుకొని) తిరిగి జపము చేసికొనుము. భగవత్ ప్రార్ధన సల్పి సత్సంగమమున మహిమాతిశయములను గూర్చి మననము చేసికొనుము.

♦ లయ, విక్షేప, క్షయ, రసాస్వాదమనునవి మరినాలుగు అంత రాయములు.

"లయ" యన నిద్రా మాంద్యము. నిదుర బద్ధకము.

"విక్షేప"మన మానస మొక విషయము నుండి మరియొక విషయమున కటు నిటు దొర్లుచుండును. ఇదియే మానసము యొక్క మర్కట స్వభావము.

"క్షయ" మనగా గుప్తమై దాగి ఉన్న సూక్ష్మ వాంఛలకే గూఢ వాసనలు లేక "క్షయ" యని పేరు.

"రస స్వాద" మన సావికల్ప సమాధి (నీచ సమాధి) యొక్క పరమ సౌఖ్యము. ఉత్కృష్ఠమగు (ఉత్తమోత్తమగు) నిర్వికల్ప సమాధి యందలి పరమ



సౌఖ్యము(బ్రహ్మానందము) ననుభవింపకుండ ఆటంకము కలిగించుచుండు నంతవరకు, సావికల్ప సమాధియనెడు నీచ సమాధి అంతరాయమనియే యెంచవలయును. ధ్యాన నిష్ఠయందలి యెక్కువ మనఃపూర్వకత శ్రమ పైని పేర్కొనబడిన చతుర్విధ అంతరాయముల నంతమొందించును.

♦ సందేహము(సంశయభావము), అసంభావన మనెడు మరియొక విధమగు సందేహము, (నేనే శారీరమనియెడి తప్పు) విపరీత భావన, ఈ మూడును మరికొన్ని అంతరాయములు. శ్రవణము వలన సంశయభావము తొలగింపబడును. మననము వలన అసంభావనము నాశనమొనర్పబడును. నిధి ధ్యాసన, ఆత్మ సాక్షాత్కారము వలన విపరీత భావము నశించును.

♦ రోగము, మానసము నందుదాసీనత (అలక్ష్యము) భ్రాంతి మనోకల్పితమగు భీతి, విషయవాంఛా తృప్తి కొరకై వెలుపలికి పరిగిడ వలయుననెడి మానసిక స్వభావము (ప్రేరణ), నిద్దుర మాంద్యము, ఆధ్యాత్మిక సాధనయందలి ఉచ్ఛస్థితి నుండి భ్రష్టత్వము(పతనము) అనునవి మరికొన్ని అంతరాయములు. జాగ్రత, యోచన(చింతాసీలత) పెంపొందిన వైరాగ్యము, గాఢమగు సాధన యనునవి పైన పేర్కొనబడిన అంతరాయములను నివారించును.

♦ అగ్ని యందుంచబడిన యినుప ముక్క ఎర్రగా కాలియుండును, అగ్ని నుండి వెలుపలకు తీయబడిన వెంటనే ఆ యినుప ముక్క చల్లబడి ఎర్రని కాంతి లేనిదగును. అది ఎల్లప్పుడు ఎర్రని కాంతి గలదిగా ఉంచ నెంచితివేని దానిని సదా అగ్నియందుంచవలయును. అదేరీతిని యెల్లప్పుడునూ భగవత్ చైతన్యానందమును రుచి చూడ అభిలషించితివేని నీ మనస్సు నెప్పుడును బ్రహ్మముతో చేర్చి ఉంచవలయును. నీవెప్పుడును బ్రహ్మమందు లీనమై ఉండవలయును.

సేకరణ, సవరణ
జె. నారాయణమూర్తి

# మాస్టర్‌గారి డైరీలనుండి M.T.A గారి దివ్యసూచనలు

**27-7-1912** శనివారం:

ఈ రోజు ఉ. **4-00**కు **1**వ గ్రూపు మీడియములకు ప్రాక్టీసు కోసం 'ఆరి యల్' కోర్స్ ఇవ్వబడింది. రెండవ గ్రూపు, క్రింది గ్రూపుల వారు వారికిచ్చిన కోర్స్‌లు చేయలేదు. వరుస ప్రకారం దీనికి ముందు చేయవలసిన నియమిత కోర్సులు చేయలేదు. అందుచేత ఈ కోర్స్ చేయడానికి అనర్హులుగా నిర్ణయించి వారిని శిక్షించడమైనది.

ఈ వారం నుండి చేయబోయే కోర్సు నామాలను నేను మార్చుతున్నాను. ఈ ప్రాక్టీసుకు వేరే టైమ్‌ను పెడుతున్నాను. కనుక రెండవ గ్రూపు, క్రింది గ్రూపుల మీడియములు ఈ రాత్రి ప్రాక్టీసుకు రానక్కరలేదు.

**28-7-1912:** ఆదివారం:

ఈ రోజు ఇచ్చిన కోర్సును ఈ సాయంత్రమే చేయాలి. ఇదివరకే ఇచ్చిన **11** నామాలలో ఒక దానిని తీసుకొని దానినే ఉదయం. సాయంత్రం ఒక్కొక్క గంట చొప్పున చేయాలి. రెండవ నామాన్ని రెండవరోజు రెండు పూటలా చేయాలి. ఈ మాదిరిగా మిగిలిన పది నామాలను చేయాలి.

**3-8-1912** సా. **8-00 NKL** గురించి:

క్రమం తప్పక ప్రాక్టీసు చేయాలి. దగ్గు ఎక్కువగా వస్తే ఈ ఆరు నామాలు ఒక్కొక్కటి **5** ని. చొప్పున మధ్యాహ్నం పూట చేయాలి. దగ్గు తగ్గుతుంది. ఈ ఆరునామాలు వీ కోర్స్‌లోనివి. **1**వ గ్రూపు మీడియములు కూడా ఈ ఆరు నామాలు చేయాలి.

1. టెన్ డీన్ పొసెషన్ కాంపోజిషన్.
2. సున్ బహిర్ అబ్డోనా సున్ తేలా బహిర్ ఆలా.



3. డెన్ కాంట్రరేలీ ప్రొడక్షన్ సిస్టమాటిక్ డివ్ నెసిటీ ఆర్ ట్రెమండస్ గోల్స్ పార్ట్.
4. దెన్ వెసెయిండ్ జోనా సోనాపుట్ ట్రావెలింగ్ ఎట్రాక్షన్స్.
5. సున్ కౌకర్ జూనా సెన్ కైలా జో కర్తాయే.
6. సున్ మాంగీ రూట్ ఆక్తా జబన తెల్.

**9-8-1912** ఉ. **8-00.** వచ్చే శనివారం కొన్ని ప్రాక్టీసు నామాలు ఇస్తాను. ఆ ప్రాక్టీసుకు రెండవ గ్రూపువారు కూడా ఈ లింకులో చేరవచ్చు. అలా చేరినవారి ప్రాక్టీసుకు రోజుకు పది నామాలు చొప్పున ఇవ్వబడతాయి. దీనికి నేను ఒప్పుకుంటాను. రెండవ గ్రూపు,

క్రింది గ్రూపుల వారు ఈ ప్రాక్టీసుకు వస్తే వారికి **1**వ గ్రూపు వారితో సమానంగా డెవలప్‌మెంట్ ఇవ్వబడుతుంది.

ఈసారి కూడా వాళ్ళు హాజరు కాకపోతే వాళ్ల ప్రాక్టీసు కాలం పొడిగించబడు తుంది. M కోర్స్ ఆరంభించినపుడు రోజుకు ఒక్క నామం చొప్పున మాత్రమే ఇవ్వబడుతుంది. ఇదివరలో ఎన్నోసార్లు సూచనలు ఇచ్చాను. కానీ మీరు నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడుకూడా నిర్లక్ష్యం చేస్తే మీరు ఎన్నో బాధలకు గురి కావలసిఉంటుంది.

**10-8-1912** శనివారం ఉ. **4-30**కు **1**వ గ్రూపు మీడియములకు 'ఆరి' 'యు' కోర్స్ ఇవ్వబడుతుంది. ప్రస్తుతం చేస్తున్న కోర్సులో మిగిలిన ఆరు నామాలను **1**వ గ్రూపు మీడియములు **9-8-1912** ఉ. **5-00**కు పూర్తి చేయడానికి పర్మిషను ఇచ్చాను. ఆ నామాలు **30** ని. ప్రాక్టీసు, **30** ని. రెస్టు చొప్పున చేయాలి.

పైన చెప్పిన ప్రకారం మొదటి గ్రూపు మీడియములందరూ హాజరయి, ఉ. **10-30**కు కోర్స్ పూర్తి చేశారు.

కుంభకోణం **11-8-1912** మీడియముల గురించి:

ఆరి కోర్స్ **6** నామాలను **6**వ శనివారం రోజున వాళ్ళు పూర్తి

చేశారు. ఇదే మాదిరిగా నేను ఇవ్వబోయే శక్తివంతమైన 'సింపుల్ సెవెన్ ఇయర్స్ కోర్స్'ను కూడా 7 నెలల్లో పూర్తి చేయాలి. అది రేపు మొదలవుతుంది. ఈ కోర్స్ చాలా జాగ్రత్తగా చేయాలి. మీడియములు అందరూ నేను చెప్పిన టైమ్‌కు రావాలి.

3వ పేజిలో నేను ఇచ్చిన 7 నామాలు నెలకొకటి చొప్పున చేయాలి. ఒకే నామాన్ని రోజు మార్చి ఉదయం సాయంత్రం అర్ధగంట సేపు చేయాలి. తరువాత రోజు రెస్టు తీసుకోవాలి. ఈ మాదిరిగా 7 నామాలు ప్రాక్టీసు చేయాలి.

ఈ కోర్సు గురించి వివరణ తర్వాత ఇవ్వబడుతుంది.

16-8-1912 శుక్రవారం:

1వ గ్రూపు మీడియముల డెవలప్‌మెంట్ కోసం సబ్ డివిజన్ నామాలు ఇవ్వాలి. ఈ కోర్స్ తీసుకోవడానికి మీడియములందరినీ 17-8-1912 శనివారం ఉ. 4-00కు రమ్మని చెప్పు. మొదటి గ్రూపుతో సమానంగా వేరే ఇంకొక గ్రూపును ఏడుగురు సభ్యులతో ఎంపిక చేయబోతున్నాను. మొదటి గ్రూపుతో సమానంగా డెవలప్ చేయడం కోసం ఒక స్పెషల్ కోర్స్‌ను వాళ్లకు ఇస్తాను. ఈ రెండవ గ్రూపు వారు కూడా నాగాలు పెట్టకుండా నేను పిలిచినపుడల్లా వచ్చి, నిర్మల హృదయంతో ప్రాక్టీసు చేయాలి. లేకపోతే వాళ్లు తీవ్రదండనకు గురి కావలసి ఉంటుంది. వాళ్లను పరీక్షించడానికి అనేక ప్రాక్టీసులు ఇవ్వబడతాయి. కనుక నీవు జాగ్రత్తగా పరీక్షించి అర్హులైన మీడియములను ఎంచుకొని, వారికి క్రింది వాటితో లింకు ఇవ్వాలి.

'ఆరి' కోర్స్ ముందువరకు ఉన్న అన్ని కోర్స్‌లను ఒక్కొక్కటి 10 ని. చొప్పున ప్రాక్టీసు చెప్పుము. ఇందుకు నేను అనుమతిస్తున్నాను. 24-8-1912 శనివారం నాటికి కోర్స్‌లు పూర్తి చేయాలి. ఆ తర్వాత ఆరి మొదటి కోర్స్ చేయడానికి నేను అంగీకరిస్తున్నాను. ఈ కోర్సులు



జరుగుతున్నప్పుడు సొసైటీలో చేరే కొత్తవారిని కూడా ఆరి లింకులోకి చేర్చుకోవచ్చు.

మెర్క్యురీ మొదలుకొని మిగతా అన్ని కోర్సులు కూడా ఈ టైమ్‌లోనే పూర్తి చేయవచ్చు. సొసైటీలో చేరే కొత్త వారిని కూడా ఈ లింకులోకి చేర్చుకోవచ్చు.

23-8-1912 మ. 1-00 1వ గ్రూపు మీడియముల గురించి:

1వ గ్రూపు మీడియములకు మిగిలిన సబ్-డివిజన్ కోర్స్ 1, 2 రేపు (24-8-1912) శనివారం ఇవ్వుము. కొత్తగా ఎంపికైన 2వ గ్రూపు మీడియములకు ఆరి కోర్స్ నామాలు ఇవ్వవలెను. 1వ గ్రూపు మీడియములు ఇప్పటికే కొన్ని నామాలు పూర్తి చేశారు. ఆ నామాలు కూడా 2వ గ్రూపు మీడియములకు ఇవ్వవలెను. కొత్తగా చేరిన మీడియములు కూడా 1వ గ్రూపు వారితోపాటు ఆరి కోర్స్ మొదలుపెట్టాలని చెప్పవలెను.

2వ గ్రూపు వారి కోసం ఆరి కోర్సులో న్యూ సబ్-డివిజన్ నామాలు ఇస్తున్నాను. 1వ గ్రూపులాగ కాకుండా కొత్తరకంగా వీళ్లను డెవలప్ చేస్తాను. దీని కోసం వీళ్లకు చాలా టెన్షన్లు పెట్టడం జరుగుతుంది. సరిగా రానివారిని సభ్యుల లిస్ట్‌లో నుండి తొలగించి, తగిన రీతిలో శిక్షించడం జరుగుతుంది.

ఇపుడు నేను న్యూ సబ్-డివిజన్ నామాలు ఇస్తున్నాను. పాత సభ్యులతో సహా అందరూ ఇవి ప్రాక్టీసు చేయాలి. ఒక్కొక్కటి అరగంట చొప్పున ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి చేయాలి. (మొత్తం 24 నామాలు 12 రోజులలో పూర్తి చేయాలి.)

28-8-1912 ఉ. 8-45 1వ గ్రూపు వారి కోసం:

1వ గ్రూపు మీడియములు 'సింపుల్ సెవెన్ ఇయర్స్' కోర్స్ చేస్తున్నారు. ఆ కోర్సులో కొన్ని చోట్ల తట్టుకోలేనంతగా శరీరాలకు

వైబ్రేషన్లు వస్తున్నాయి. అది నేను గమనించాను. దానిని సవరించడం కోసం **31-8-1912** శనివారం నాడు ఈ క్రింది కోర్స్ ఇస్తున్నాను. మీడియములందరూ వచ్చే పక్షంలో, ఆ రోజునే ఈ కోర్స్ ఇవ్వవలెను. అందరూ రాని పక్షంలో ఈ కోర్స్ **19-9-1912**న ఇవ్వవచ్చును. ఈ విషయం వారికి చెప్పుము.

**10-9-1912** మీడియముల గురించి:

ఇచ్చిన తేదీ నుండి **7** నెలలలోపు సింపుల్ సెవెన్ ఇయర్స్ కోర్స్ పూర్తి చేయాలి. మొదలుపెట్టినపుడు మొదటి నామం **30** రోజులు చేయాలి. **29**వ రోజున రెండవ నామం, ఈసారి ఈ క్రమం తప్పింది. ఇది సరిచేయటానికి నేను కొన్ని కోర్స్‌లు ఇచ్చాను. అవి ఈ రోజు మ. **3-00**కు మొదలు పెట్టాలి. ఇవి అయిపోయిన తర్వాతనే రెండవ కోర్స్ ఇవ్వాలి.

**29-9-1912** మీడియములకు స్పెషల్ వార్నింగ్:

న్యూలైన్ గురించి ఇంతకుముందు ఎన్నో రకాలుగా నేను మీకు వివరించి చెప్పాను. కోర్స్‌లు చేయడానికి ఎంపిక కావడం మీ ప్రతిభే అని అనుకున్నారు. మిమ్ములను మీరే చక్కదిద్దుకోగలమని గట్టిగా నమ్మారు. అలా అనుకుని **1**వ గ్రూపు వారు కూడా కొన్ని కోర్సులకు రాలేదు. ఆరి కోర్స్ ప్రారంభించబోయే ముందు, కొందరు మీడియములకు రెండు నెలలు, మూడు నెలలు బహిష్కరణ శిక్ష కూడా విధించబడింది. ఇలా శిక్షించినపుడు కూడా మీ దేహ మార్పులు మీరు గమనించే స్థితిలోనే మిమ్ములను ఉంచాను.

**TH**కూడా **1**వ గ్రూపు మీడియమే. కొన్ని టెస్ట్‌లు నిర్వహించడానికి అతనిని ఎన్నుకున్నాను. ఆ విషయం అతనికే చెప్పి ప్రాక్టీస్ నామాలు ఇచ్చాను.

శక్తిని **213** లక్షలకు తగ్గించి వైబ్రేషన్లు డెవలప్‌మెంట్లు ఇచ్చాను.



ఇప్పుడు ముఖ్యంగా చెప్పడమేమిటంటే మీడియములు ఒకరిపట్ల ఒకరు అసూయ పెంచుకుంటున్నారు. వాళ్లను టెస్టులకు గురిచేసి వాళ్ల మనసులు చక్కదిద్ది, పరస్పర అసూయను పోగొట్టడం కోసం నేను కొన్ని శక్తివంతమైన కోర్స్‌లు ఇచ్చాను. ఈ టెస్టులలో వాళ్లలోని లోపాలు వెంటనే బయటపడ్డాయి. కానీ వాళ్ల మనసులు మాత్రం చక్కబడలేదు.

ప్రతి ఒక్కరిలోని మానసిక వైకల్యం పోగొట్టడానికి కావలసిన అన్ని కోర్స్‌లు నేను సూచించాను. ఆరి కోర్స్ పూర్తి చేసేటప్పుడు వాళ్ల మనసులు ప్రక్షాళనం కావాలి. అందుకోసం శక్తివంతమైన కోర్స్‌లు ఇచ్చాను. తీరా చూస్తే వాళ్ల మనోవైకల్యం ఇంకా పెరిగింది. నేను మరీ ఎక్కువ శక్తిమంతమైన కోర్స్‌లు ఇవ్వడమే దీనికి కారణం.

స్థూల శరీరం బాహ్య పదార్థంతో తయారయింది. (బాహ్యపదార్థమంటే పూర్వజన్మల ప్రవృత్తులు లేక పూర్వ కర్మలు లేక కర్మ విధానమన్న మాట). ప్రతి శరీరం విభిన్న తరహాల చెడు బాహ్య పదార్థంతో (మన తల్లితండ్రుల అటు ఇటు ఏడు తరాలు) తయారై ఉంటుంది. ఈ న్యూ లైన్‌కు ఆ చెడు ప్రవృత్తులన్నిటినీ బయటకు నెట్టివేసే సామర్థ్యం ఉంది.

కర్మ విధానాన్ని దాని మూలం వరకు పరిశీలించడానికే ఈ లైన్ ప్రారంభించబడింది. ఈ కారణంగానే శరీరాలు అమితంగా వేడెక్కడం, బాహ్య పదార్థం రాకెట్‌లాగ బయటకు నెట్టబడటం జరుగుతోంది.

ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతి చెందినవారి శరీరాలలో సైతం (భార్యభర్త సంబంధాలు) కొన్ని మానసిక వైకల్యాలు ఎంతో లోతులలో దాగి ఉంటాయి. అవి కూడా ఒక్కసారిగా బయటకు నెట్టబడతాయి. అలా జరిగినపుడే శరీరాలు బాగుపడతాయి.

ఒక దృఢమైన సంకల్పంతో ఒకానొక వున్నతస్థితి మానవరూపానికి వచ్చింది. ఉన్నత స్థితిగల మానవ రూపం ప్రకృతి సిద్ధంగా ఉన్న వారికి అలాంటి దృఢ సంకల్పం ఇవ్వబడుతుంది.

గ్రహ విధానంలో జన్మించినవారు ప్రతి జన్మలోనూ కొన్ని పరీక్షలకు గురి అవుతారు. ఇందుకోసమే నేను నాలుగు నెలల కోర్స్ ఒకటి ఇచ్చాను. ఆ కోర్స్ వలన శరీరం చక్కబడి, ఆపై కోర్స్‌లు చేయడానికి తయారయి ఉంటుంది. మార్గం అత్యంత కష్టభరితం.

ట్రాన్స్ మీడియములు కూడా గ్రహ విధానంలోనే జన్మించారు. నేను వాళ్ల జన్మ మూలాన్ని పరిశీలించాను. స్వయం ప్రకాశమైన ప్రజ్ఞాస్థితి వాళ్లకు లేదు. అందుచేతనే తాము తీసుకునే జన్మలలో వాళ్లు తమను తాము బాగు చేసుకోలేకపోతున్నారు. ఒక వృక్షాన్ని గమనించితే, ఆ వృక్షం యొక్క సూక్ష్మస్థితిలో అనేక మార్పులు జరుగుతుంటాయి. అదే మాదిరిగా, ట్రాన్స్ మీడియం కూడా స్థూల శరీరంలో మార్పుల కోసం ఎన్నో టెస్ట్‌లకు గురి కావలసి వుంటుంది.

ట్రాన్స్ మీడియముకు, ప్రాక్టీసు మీడియముకు మధ్య తేడా ఉంది.

కొంతమంది ప్రాక్టీసు మీడియములు ఆలోచనా పటిమద్వారా ఈ లైన్‌లో డెవలప్ కావచ్చని అనుకుంటున్నారు. కానీ ఒక ఆలోచనపోతే మరొక ఆలోచన వాళ్ల మనసులను వికలం చేస్తుందని వారికి తెలియదు.

దీనిలో ఎడమ చేతి విధానపు వర్కింగ్‌కూ, కుడి చేతి విధానపు వర్కింగ్‌కూ తేడా ఉంది. (ఎడమ-పాత కర్మ సిద్ధాంతం, కుడి-మాస్టర్‌గారి న్యూ యోగ సిద్ధాంతం) ఇది పరీక్షలో కూడా తేలిన విషయమే. కానీ వాళ్లు ఎడమ విధానానికే వెళ్తున్నారు. ఎడమ విధానానికి టెస్ట్‌లు పెట్టినపుడు, ఎడమ విధానంలోకి వచ్చామేమిటి అనుకుని ప్రాక్టీసు టైమ్‌లో వాళ్ల ఆలోచనలన్నిటినీ వదలివేస్తున్నారు.

ప్రాక్టీసు టైమ్‌లో జాగ్రత్ స్థితిలో మార్పు వచ్చినపుడు,



క్రమబద్ధమైన ఈ న్యూలైన్‌ను వదలి వెళ్లి ఎడమ విధానంలోనికే వెళ్తున్నారు. అంటే కర్మ సంబంధమైన ఆలోచనా విధానంవైపు వెళుతున్నారు.

ఈ కారణం చేతనే, వాళ్ల లోలోపల పేరుకుని ఉన్న భావాలు, లక్షణాలు వాళ్ల పూర్వకర్మ ప్రవృత్తుల ననుసరించి ఆలోచనల రూపంలో వాళ్లకు కోర్స్‌లు చేసేటపుడు వస్తుంటాయి. ఈవిధంగా మీకు వచ్చే ఆలోచనలను మీ మనసులో గుర్తుంచుకుని, వాటిని గురించి నాతో చర్చించి, మీ తార్కిక జ్ఞానం ఆవిరైపోయేలా చేసుకోండి.

నేనిచ్చిన సూచనలు, కోర్స్ నామాలు వదలివేసి, మీకు తెలిసిన విధానంలోమీ శరీరాలను బాగు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మనకోసం వచ్చే సూచనలు గ్రహించి, ట్రాన్స్ మీడియం వాటిని చెపుతుంటే అదే టైమ్‌లో ఇంకొక మీడియం మాస్టర్స్ ఎడ్జస్ట్‌మెంట్ గురించి పరిశీలిస్తున్నారు. ఇతరులపట్ల అనూయతో కుమిలిపోయి, దానిని బహిర్గతం చేయవద్దని మీకు ఇదివరకే చెప్పాను. దీనిని నివారించడం కోసమే నేను 'ఆరి' కోర్స్ ఇచ్చి, 4 నెలలకు బదులు 7 నెలల్లో దానిని పూర్తి చేయమన్నాను.

ఎందుకు అనేది తెలియకుండానే మీరు యాస్ట్రోగ్రూపు ప్రాక్టీసుకు హాజరయ్యారు. మొత్తం గ్రూపు ఆలోచనలు ఏకోన్ముఖం కావడమే యాస్ట్రో గ్రూపు ప్రాక్టీసు లక్ష్యం. ఈ ఉద్దేశ్యంతోనే దానికి యాస్ట్రోగ్రూపని నేను పేరు పెట్టాను.

దీనివలన కూడా మీరు చక్కబడలేదు. నేను మీడియములకు కఠినమైన నియమనిబంధనలు ఏర్పరచలేదు. కొంత ఉదాసీనంగానే ఉన్నాను. ఇందుచేతనే మిమ్ములను మీరు చక్కదిద్దుకోలేకపోయారు. ఇకమీదట కఠినమైన నియమ నిబంధనలు ఇస్తాను.

మీడియముల డెవలప్‌మెంట్ లిస్ట్ ఈ క్రింద ఇస్తున్నాను.

**29-9-1912** డెవలప్‌మెంట్ లిస్ట్ - యాస్ట్రోగ్రూప్:

1. **CVV** - అణిమ, లఘిమ, గరిమ, మహిమ అనే నాలుగు విభాగాలు శరీరంలో ప్రవేశించి, శరీరాన్ని పరీక్షకు గురి చేస్తున్నాయి. దీనిలో, నిమిషానికి **15090** లక్షల గన్స్ శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి.

2. **VR** లహితముని సంబంధంగా ఇతనెంతో సూక్ష్మ జ్ఞానం సంపాదించాడు. దీనిలో నిమిషానికి **15010** లక్షల గన్స్ శరీరంలో ప్రవేశిస్తున్నాయి.

3. **TH** ఈ పరీక్షలో ఇతను నిముషానికి **2016** లక్షల గన్స్ చొచ్చుకుపోయాడు. దీనివలన ఇతని శరీరంలో కొంత బాహ్య పదార్థం పేరుకుపోయింది. అందుచేతనే "వాల్గేశఋషి మూలం"తో కనెక్షన్ ఏర్పడింది. ఇతను **2016** రోజుల కోర్స్‌కు దిగువన ఉన్నాడు.

5. **CAS** - రెండు నిముషాలకు **5016** గన్స్, అహంభావంతో ఇతనికి "ప్రత్యేయఋషి" నిండి ఉన్నాడు. అందువలన ఇతని శక్తి **1520** గన్స్ శక్తికంటె తక్కువ.

6. **BSK**- ప్రస్తుతం "గాద్యఋషి" ప్రతిబింబిస్తున్నాడు. నిముషానికి **10005** లక్షల గన్స్ ప్రవేశిస్తున్నాయి. దీనిలో **2, 6** శక్తికంటే తక్కువ

7. **CR**- సెకన్‌కు **10015** లక్షల గన్స్. ఇతను "గణాధ ఋషి" మూలంలోకి చొచ్చుకుపోయాడు. "బహిష్కరణ"- ఆలోచనలు చక్కబడేదాకా వారం కోర్సులకు, నెల కోర్సులకు ఈ క్రింది వారు రావటానికి వీలులేదు.

**1. TH - 3**వారాలు, **2. BSK-2**వారాలు, **VR-2**వారాలు, **CAS-4** వారాలు, **CR-1**వారం.

**9-10-1912** ఉ. **9-00** మీడియముల గురించి:

పరిపరివిధాల ఆలోచనల కారణంగా ఎన్నో ప్రాక్టీసులు వెనుకకు తగ్గి, సరయిన డెవలప్‌మెంట్ జరగలేదు. ఈ ప్రాక్టీసులో అనేక సబ్-డివిజన్ నామాలు పూర్తి కాకుండా ఉండిపోయాయి. అందుచేతనే,



ఈరోజు నేను తదుపరి కోర్స్‌లు చేయడానికి అంగీకరించలేదు.

ప్రాక్టీసు పూర్తి చేయకపోవడంవలన కొంతమంది మీడియములకు బహిష్కరణ శిక్ష విధించాను. మిగిలిపోయిన ప్రాక్టీసు వాళ్లు పూర్తి చేయవలసిందేనని నా నిర్ణయం.

**21-10-1912** మీడియముల గురించి:

మీడియములకు నేను ఇంతకుముందే సూచనలు ఇచ్చాను. నా సూచనలు విని కూడా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. నేను చెప్పిన విధంగా ప్రాక్టీసు చేయడానికి ఇంతవరకు సిద్ధము కాలేదు.

కొంతమంది మీడియములు శారీరక రుగ్మతల నివారణ కోసం కొన్ని కోర్సులు చేశారు. శారీరక రుగ్మతలు ఈ లైన్ ద్వారా పోగొట్టుకోవాలనే ఆలోచనతో మన సొసైటీ బాగా అభివృద్ధి చెందాలనే ఏకైక దృఢనిశ్చయంతో వాళ్లు ప్రాక్టీసు చేయాలి. సొసైటీ అభివృద్ధి చెందితే, దాని ఫలితం మనకు కూడా వస్తుంది. ఈ కృతనిశ్చయంతోనే వాళ్లు ప్రాక్టీసు చేయాలి. ఆలోచనలనన్నిటినీ వదలివేసి, ఉత్సాహంగా వాళ్లు పనిచేయాలి. అందరూ కలిసి రెట్టింపు కృషి చేయాలనే పట్టుదల అన్ని గ్రూపులకు ఉండాలి. అలా చేసే మీడియములకు మాత్రమే డెవలప్‌మెంట్‌లో పైకి లిఫ్టులు ఇవ్వబడతాయి.

ఇలాంటి లిఫ్ట్‌లు ఇవ్వడం కోసమే ఇదివరలో అనేక టెస్టులు చేయడం జరిగింది. కొందరు మీడియములు ఆఫీసు పని మూలంగా వీలుపడలేదని కోర్స్‌లు సరిగా చేయలేదు. అందుచేత ఆ మీడియములకు తదుపరి కోర్స్‌లు ఇవ్వడంలో కొంత ఆలస్యం జరుగుతుంది.

ఈ కోర్స్ చేయడంలో ఆస్తివరులైన మీడియములు కొంత బాధకు గురికావలసి ఉంటుంది. ఆ తరువాత వాళ్లు చక్కబడతారు.

ఇదే మాదిరిగా ప్రతి మీడియము కూడా బాధలను అధిగమించాలి. దానికి నేను ప్రోసెస్ ఇస్తాను. ప్రాక్టీసు టైమ్‌లో

శరీరం కొంత ఇబ్బందికి గురవుతుంది. దీనివలన లోపల పేరుకుని ఉన్న అనవసరమైన కోపం బయటకు నెట్టబడుతుంది.

ఈ ప్రాక్టీసు వలన మీడియములకు కొన్ని శక్తులు వస్తాయి. ఆ శక్తులు రావడం వలన బాధలు, కష్టాలు బయటకు నెట్టివేయబడతాయి.

ఈ ప్రాక్టీసు వలన శరీరం బాగుపడుతోంది. బాగుపడిన శరీరాలు ఇంకా ఉన్నతమైన కోర్స్‌లు చేయడానికి తయారయి ఉంటాయి. ఈ ప్రాక్టీసు వలన శరీరంలోని వివిధ కేంద్రాలకు సంబంధించిన అవసరాలు తీరుతాయి.

ప్రస్తుత ప్రాక్టీసు అత్యంత శక్తివంతమైనది. వాళ్ల వాళ్ల స్థితినిబట్టి మీడియములకు టెస్ట్‌లు ఇవ్వబడుతున్నాయి. ఈ లైన్‌ను అనుసరించాలనే దృఢ సంకల్పం, పట్టుదల ఉండి, సొసైటీ నియమ నిబంధనలను పాటించే మీడియములు మాత్రమే ఈ ప్రాక్టీసు చేయడానికి అంగీకారం తెలపాలి. వాళ్లకు మాత్రమే పై కోర్స్‌లు ఇకమీదట ఇవ్వడం జరుగుతుంది.

ఈ కోర్స్‌లు చేయాలని కృతనిశ్చయులైనవారు రోజుకు ఒక్కసారి, సాయంత్రం ప్రేయర్లకు తప్పకుండా రావాలి. రోజూ సాయంత్రం రానివారు సొసైటీ నుండి శాశ్వతంగా బహిష్కరించబడతారు కనుక ప్రతి ఒక్కరూ వాళ్ల తప్పులు సరిదిద్దుకోవాలి. ఎలాంటి అసూయకు తావివ్వకూడదు. నిష్కల్మషంగా వుండాలి. నిర్మల హృదయంతో ఉండాలి. ప్రాక్టీసు మొదలు పెట్టగానే మనకు స్వాతంత్ర్యం వస్తుందనే ఆలోచనకు తావివ్వకూడదు. దానిని పూర్తిగా తుడిచివేయాలి.

అత్యంత శ్రద్ధతో ప్రాక్టీసు చేయాలి. ఎవరినీ హేళన చేయకూడదు. పూర్వకాలంలో శిష్యులు తమ గురువు చెప్పినదానిని ఆచరిస్తూ, సత్య తత్పరతతో తపస్సు చేశారు. అదేవిధంగా మీ



మాస్టరుగారు చెప్పింది మీరు పాటిస్తే ఈ యోగం గొప్పతనమేమిటో మీకు తెలుస్తుంది.

ఈ యోగ ప్రాక్టీసు గురించి ఇంకా ఇంకా చెప్పడానికి నేను సిద్ధంగా వున్నాను. మీరు చేస్తున్న మాదిరిగా విలువైన సమయాన్ని వృధా చేయటానికి తెలివి తక్కువగా ఈ యోగం ఆరంభించబడలేదు.

సీతారామన్ ఇచ్చే సూచనలను పాటించడానికి మీ మాస్టరుగారికి నేను పర్మిషను ఇచ్చాను. ప్రాక్టీసులో ఏడు దశల వరకు సీతారామన్ గమనించగలుగుతున్నాడు. సొసైటీ ఆవరణను దాటేటపుడు, తన ప్రాక్టీసు ఫలితాన్ని సొసైటీలోనే వదిలేసి వెళ్తున్నాడు. సొసైటీకి అతను ఎలాంటి ద్రోహమూ చేయడంలేదు.

సొసైటీ ఆవరణ వదలిన తర్వాత, సొసైటీ ఆస్తిని తన వెంట తీసుకువెళ్లే అలవాటు అతనికి లేదు. (అంటే సొసైటీ ఆవరణ వదలిన తర్వాత ప్రాక్టీసు గురించి ఆలోచించడంగానీ ఇంటివద్దే ప్రాక్టీసు చేయడంగానీ అతను చేయడు. **MTA** ఈ లైన్‌ను ఇచ్చింది దీని కోసమేనా?) పై విషయాలన్నీ మీడియములందరికీ వివరంగా తెలియచేయాలి.

**23-10-1912** మీడియముల అప్లికేషనుకు నకలు:

దివ్య పురుషులు ఈ సొసైటీకి ఫ్రెండ్స్ సొసైటీ అని పేరుపెట్టారు. ఆనాటి నుండి ఈనాటి వరకు వాళ్లు పెట్టిన నియమనిబంధనలు పాటించే వారినందరినీ ఈ సొసైటీలోకి చేర్చుకోవడం జరిగింది. అయినప్పటికీ మీడియముల పరంగా కొన్ని పొరపాట్లు దొర్లాయి.

దీనివలన మీడియముల మధ్య విభేదాలు, పరస్పరం అనుమానాలు పొడసూపాయి. దానితో మా మధ్య సఖ్యత దెబ్బతిన్నది. ఏం జరిగిందీ మాకు తెలుస్తూనే ఉంది. కానీ మమ్మల్ని మేము చక్కదిద్దుకోలేక

పోయాము. దివ్య పురుషుడు మా పొరపాట్లు ఎత్తిచూపి మమ్మల్ని సక్రమ మార్గంలో పెట్టాడు. ఇపుడు మేము బాగుపడినాము. ఇక మీదట మామధ్య మాకు అభిప్రాయభేదాలు, కోపం, అసూయ మొదలైనవి ఉండవు. సొసైటీలో మిత్రులపట్ల ఎలాంటి అరమరికలు ఉండవు. ఇతరులకు ఇబ్బంది కలిగేలా మేము ప్రవర్తించము. అత్యంత భక్తితో మేము మా గురువుగారికి నమస్కరిస్తున్నాము. సత్యానికి భిన్నంగా ఏదీ చేయము. సొసైటీ పద్ధతులకు అనుగుణంగానే మేము ఎల్లప్పుడు ప్రవర్తిస్తాము. మేము సంతకం చేస్తున్నాము.

13. సంతకాలు: 1. టి.హబిళయ్య, 2. వి.రాంచంద్రన్, 3. సి.ఏ.శంకరశాస్త్రి, 4. సి.వి.వెంకటరామ్, 5. సి.రాధాకృష్ణన్, 6. కె.సీతారామన్, 7. పద్మనాభ అయ్యర్, 8. వి.సుందరేశన్, 9. యన్.సుందరేశ్ అయ్యరు, 10. ఆర్.రాజారావు, 11. బి.యన్.కృష్ణమూర్తి, 12. సుందరేశశాస్త్రి, 13. ధర్మదీక్షితార్.

మిగతా . . . . మా రాబోవు సంచికలో



# M.T.A. Letters
## Volum III
## Letter NO 23

గత సంచిక తరువాయి . . . . . . .

సా. 10-30 P.M. కుంభకోణము 30-6-1910

**To the publicator:** ప్రచురణ కర్తకు.

ఈ సమాచారము ప్రజలకు మరియు సొసైటీ వారికి:

అయ్యా:

మీరు ప్రతి దినము అలవాటుగా, దినచర్యగా చేయుటకు మీరు వీటిని ఇచ్చినందులకు ధన్యవాదములు చేయు విధముగా ఇంద్రియ జ్ఞానముతో గుర్తించులాగున శాస్త్రముల కనుగుణముగా భవిష్యత్ అభ్యుదయము కొరకు ధర్మబద్ధముగా మీరు వీటిపై దృష్టి పెట్టునట్లుగా, ప్రస్తుత భావములను మార్పులతో బాగుచేసి మీ స్థానంలో అర్థమగునట్లుగా మొగ్గి (వంగి) వ్రాయుచున్నాను. ఈ విషయమును మరల ఒకసారి వెనుకకు వెళ్లి మీ ముందు ఉంచుచున్నాను. 'ఈ ఆధ్యాత్మిక సమాచారాన్ని ఈ యూనివర్స్‌ను నడుపు అధికారవర్గము అయిన ధైవీయ స్థితులను గౌరవించతగ్గట్లుగా, వీటిని గురించి అందరకు తెలియుటకు ప్రచారము చేయదగ్గట్లుగా మనకబారని హిందూ బ్రాహ్మణులు (స్వచ్ఛమైన బ్రాహ్మణులు) ఆ దైవీయ అధికారుల ప్రకంపనలను అనుసరించుచున్నారు. ప్రజలనుండి ఎలాంటి అండదండలు లేనప్పటికీ ఈ ప్రపంచమున జన్మ తీసుకున్న బ్రాహ్మణులు, వాటి విలువలపై అవి నిలబడగల ధైవీయ భావములను తెలుసుకొని ప్రజలనుండి వచ్చు నిందలను, విమర్శలను పొందుచూ వాటిని అనుసరించుచున్నారని వాటిని వ్రాత ద్వారా తెలియజేయుటకు శిష్యుడు అయిన సుందరము వెనకాడు చున్నాడు.

అహంకారము, అధర్మప్రవర్తన, చమత్కారముగా మాట్లాడుట, స్థిరచిత్తములేని తనముతో వారు పలుచబడిన దైవీయ భావములపై మనసు పెట్టలేకపోవుట జరుగుచున్నది. రక్షించలేని, సహకరించలేని, విశ్వములోని దైవమును తెరమరుగున ఉంచి, వారి అంతర్ జ్ఞానముతో ప్రజలను భయభ్రాంతులను చేయుటనుబట్టి ఆ ప్రజలు మరియొక విధముగా సమ్మతించవచ్చును. ముఖ్యమైన సందర్భములలో వాటిని అనుసరించుటకు అవసరమైన తీరిక ఉండుటలేదు. జనాభా పెరుగుట, దారిద్ర్యం, పేదరికము ప్రాప్తించుట అనే ఈ రెండు కారణములను ఎదుర్కొనాలనే ఆలోచన, స్థిరమైన సంకల్పశక్తి లేకపోవుటవలన వాటిని అనుసరించలేక పోవుచున్నారు. ప్రలోభపూరిత విషయవాంఛలు అసలు విషయమును అమర్యాద, నిరాదరణ చేయుచున్నవి. ప్రస్తుతము గల ఇతరులపై ఆధారపడు పరిస్థితులలో స్వతంత్రముగా బాధ్యతతో పని చేయుటకు అలవాటు పడిన వ్యవధులలో ఆజ్ఞలను పాటించుచూ నూతన సూత్రములను పాటించవచ్చు. రెండు విషయములలో (ప్రస్తుత విధానములో మరియు నూతన విధానములో) వాటిని ఇముడ్చుకొనలేక, బతుకలేక అనేక జనులు నిరాశాజనకముగానున్నారు. మిగతా విషయములు నా రాబోవు పిలుపులో.

pupil S.S                                M
for master S.S                           11-10 P.M
30`6`1910



# M.T.A. Letters
## Volum III
## Letter NO 24

5`20 P.M. కుంభకోణము **1-7-1910**

రోజువారీగా సాధన అలవాటు కొరకు శిక్షణ:

**1/182/1:** శరీర నిర్మాణ క్రమము వాటి కార్య నిర్వహణ కొరకు మీ **one** తో ఈనూతన సూత్రములను అనుసరించుట మీ సిస్టమ్‌ను పురోగమనముగా అంతర్‌జ్ఞానముతో అభివృద్ధి పరచుటయే కాకుండా సిస్టమ్‌లోని అవలక్షణములను, మలినములను శుభ్రపరచుట కూడా జరుగును.

**2/182/2:** మీరు అనుసరించవలసిన విధానము- సాధన రోజూ సమయపాలనతో మీ ఉద్దేశ్యము ప్రకారము, నిర్ణయించుకున్న వట్టిక ప్రకారము మీలోని మాలిన్యములను పారద్రోలుటకు, శరీరమునకు సంబంధించిన చికిత్స (కార్యసాధన) చేయుట, వాటి ద్వారా జరుగు అద్భుతములను స్వయముగా అనుభవమునకు తెచ్చుకొనుట, ఈ సూత్రములు ఎవరికి వారు చేసుకొను సూత్రములు అగుటవలన వీటిద్వారా మీ అంతట మీరు **one** వరకు ఎదుగుటకు, ఆ **one**కు గల రుగ్మతలను తొలగించుకొనుటకు చేయు విషయములో మీరు మీ స్వంత విధానముతో చెమటోడ్చి కష్టపడి సాధన చేసి మరియు అవసరమైన ఔషధములు వాడి, రెండు విధములుగా స్వస్థత చేకూర్చుకొనవచ్చును. అందువలన అదే విషయమునకు అవసరమైన విధముగా నిర్మాణ సూత్రములను క్రమపరచుకొనవలసినది. క్రమము తప్పకుండా సాధన చేయుటకు ఒక క్రమకర్తగా అనుసరించవలసినది.

**1/183/3:** నీకు నీవుగా శరీరమును శుభ్రపరచుకొనుట నీ

స్వయం నియంత్రణ శక్తిపై ఆధారపడి ఉన్నది. నీ బాడీని రక్షించు రక్షకుని శక్తియే శుభ్రపరచును. నీ ఇంటిని నీవే శుభ్రము చేయుటకు నీ సేవకులకు (రక్షకులకు బాడీగార్డ్స్‌కు) నీవు అవసరమైన ఆజ్ఞలను ఇవ్వవలసినది. నీ శరీరము, నీకు తెలియని నీలోని **one** యొక్క భావ ప్రకంపనల ద్వారా నిర్మింపబడినది. అందువలన నీవు బాధ్యతగా నీలో నుండి (**one** నుండి) వచ్చు మధురమైన భావ ప్రకంపనలను బాధ్యతగా గ్రహించి వాటిని అనుసరించిన **one**ను శుభ్రపరచుకొనుట జరుగును.

**1/184/4:** కాబట్టి మొదటగా నీ శరీరమును శుభ్రపరచుకొను విధానమును అనుసరించి ఆ తరువాత నీ సిస్టమ్‌లో అంతర్ భాగము **(upstairs)**లో గల మలినములను మళ్లించి, అంతర్ భాగముల నుండి బయటకు చూచు ద్వారములను శుభ్రపరచవలసినది. (యాస్ట్రల్ సైట్ వగైరాలు పొందుటకు అవసరమైన శుభ్రతలను గమనించాలి). మిమ్ములను మీరు ఈ విషయములపై ప్రశాంతముగా గమనించి, అంతర్ భాగముల నుండి వచ్చు భావములను పరిశీలించిన మీరు మీకు గల మీ 'వన్' ను చేరవలయుననే నిశ్చయమైన దృఢసంకల్పము, ఆవిధంగా మీ సంకల్పము పని చేయు విధానము, దాని శక్తి సామర్థ్యములు మీకు అవగతము కాగలవు.

**2/184/5:** మీ అంతట మీరు పైన చెప్పిన లెవెల్స్‌ను సందర్శించినప్పుడు అవి ఏవిధముగా నిర్మాణము చేయబడ్డవో మీ మనస్సుకు అవగతము చేసుకొనండి. ఆ విషయములో ఏ "థాట్‌పవర్" ను ఏవిధముగా ఉపయోగించారో ఆ విధానము చాలాగొప్పది. అదేవిధముగా సున్నిత నిర్మాణ సూత్రములలోని భావములను అవగాహన చేసుకోండి. ఈ విధానములో మీ సాధారణ భావనాశక్తిని ప్రక్కనబెట్టి (లేక) దానిని సరైన విధముగా అంతర్ముఖము చేసి



**(Right hide)** ఈ నిర్మాణసూత్రములను సమయ పాలనతో చేయవలసినది. ఈ నిర్మాణసూత్రములు మీ భావనా శక్తిని ఆవిధముగ పనిచేయునట్లు చేయును. ఇతర మానవులెవ్వరూ, ఏ మనిషి, ఏ నిబంధన, ఎలాంటి అధికారములు మిమ్ములను మీరు ఏర్పరచుటకు, సృష్టి చేయుటకు ఈవిధముగా ఉపయోగపడలేవు.

**1/185/6:** ఇతర సిద్ధాంతముల ప్రకారము ఏ మనిషి కూడా ఈ విధముగా మీ అంతట మీరుగా స్వయంశక్తిపై ఆధారపడి ఎదగలేడు. అవి ఏవీ కూడా ఇలాంటి అద్భుతములను చూపించలేవు.

2/ 185/ 7: MT n+Ôá Ò̂e TT\ T **(staircase)** ఏవిధముగ నిర్మింపబడినవో మీరు చూడగలరు. మీరు వాటిని (అంతర్ విషయములను) చేరిన తర్వాత ఏవి మీకు ఉపయోగకారిగా ఉండగలవో తెలుసుకొనగలరు. అప్పుడు మీకు గల సమస్యలను మీరు తీర్చుకొనగలరు. అక్కడగల పొరల వరుస ఇటుకల కట్టుబడి దృఢమైనదిగా **(iron)** ఉంటే మీ శరీర నిర్వాహకత్వము నడుపుచూ అభివృద్ధి పరచుచూ ఉన్ననూ, చూచుటకు శాశ్వతమైనదిగా కనబడినను అది ప్రస్తుత నాటకములో నటించుటకు ఉపయోగపడినను, అది పని చేయుటకు, చూచుటకు ఆ ఎత్తుకు ఎదుగుటకు మాత్రమే ఉపయోగపడును. అది అక్కడి వరకు తగిన విధముగా నిర్మాణము చేయు జ్ఞాపిక మాత్రమే.

**1/186/7:** ఈ పై నుండి క్రిందికి క్రింది నుండి పైకి వెళ్లగలిగిన అంతర్భాగమును **(staircase)** మీరు చూచుటకు, పరిశీలన చేయుటకు ఉపయోగపడేటటు వంటిది ఈ విశ్వము ద్వారా నీకు సంతరించినది. మీరు ఎక్కడ ఆ విషయమును గమనించగలరో అదే మీ ప్రవేశద్వారము, అదే మీ నిష్క్రమణద్వారము. అదే విశ్వ ఆవరణలోని ద్రవ్యరాశి మీలోనికి ప్రవేశించుద్వారము. అక్కడ మీరు ఇంకొక

మెట్టును ఎక్కవలసి ఉన్నది. అక్కడ మీరు మీ అంతరములో ఒక ఆధారమయిన అంతర్ ముఖమును, దీనికి అనుసంధానములుగ ఉన్న విభాగమును చూడగలరు. అక్కడ ఆ ఆవరణలోనికి చొచ్చుకొని పోగల ద్వారమును గమనించ గలరు. అవి మీకు ఏవిధముగా కనబడుచున్నవో మీ ఆవరణ మీరు మీ సంకల్పశక్తితో వాటిలోనికి వెళ్ళగలిగిన అక్కడ ఉన్న విషయములను చూడగలరు. ఇది సాధన ద్వారా సమకూరును. అవి అప్పుడు అక్కడ సెకనుకు, నిముషమునకు ఏవిధముగా రంగులు ప్రత్యేక రంగులుగా మారు చున్నవో గమనించగలరు.

**1/187/8:** అక్కడగల ఉపరితల భాగము (కప్పుభాగము) దృఢమైన రాడ్‌లతో (iron bar) అభేద్యముగా నిర్మాణము చేయబడినదిగా ఉండి, మరియొక విధముగా అతి మృదువుగా అరటిపండు వంటి పొర గలిగినదిగా ఉండి సిస్టమ్‌కు ఆహ్లాదకరమైన గాలిని అందించునదిగా తెలియబడుచున్నది. మానసస్థాయిని ప్రవేశించుద్వారమువద్ద మీరు ఒక స్పందనలనిచ్చు విధానమును గమనించవచ్చు. ఇది మన సిస్టమ్‌లో పని చేయుచునే ఉండును. ఈ ప్రకంపనలనుండి ఉరుములు లాంటి ప్రకంపనలు మీ అవధాన స్థితిని (నిశ్చలస్థితి) ఆవైపునకు మరల్చి వాటిని గ్రహించి అనుసరించు లాగున చేయును. ఉపరితలములోని పొరను గమనించండి. వాటి నిర్మాణ విధానమును గమనించండి, వాటి తీరును, వైఖరిని, వాటిపరిమాణమును అక్కడి నుండి వాటి పరిత్యాగమును, అక్కడి వెలుతురును, లోపలికి బయటకిగల ప్రవాహమును, అక్కడగల దృశ్యములను, విషయ విధానముల విలువలను, అక్కడినుండి బయటపడగల విధానమును సమయపాలనతోగల సాధనలో గమనించి భావనాశక్తిని, సంకల్పశక్తిని, వాటిని అభివృద్ధి చేసుకొను విధానమును, మీ సిస్టమ్ యొక్క



పురోగతిని, మీ సంస్కారములను వృద్ధి చేసుకొను విధానమును గమనించి మీజ్ఞానాభివృద్ధిని చేసుకొని ''డెల్యూడింగ్ వన్''ను చేరగలుగుతారు. మీరు ఏ విధానముతో ఈ నిర్మాణ సూత్రములను అనుసరించి పనిచేయుచున్నారో వాటి సహాయముతో మీరు ఆ ''వన్''ను తెలుసుకొనగలరు. ఈ విషయములు గురించి అసలు తెలియని వారిని వారు ఎవరైనప్పటికీ వారి వారి భావములను తృప్తిపరచుచూ వారి సంస్కృతిని వారు నిర్మాణము చేయుచూ ఆ స్థితికి చేరినచో వారు, ఆ అద్భుతములను అనుభవమునకు తెచ్చుకొన్న వారయి ఆ స్థితికి పురోగతి చెందగలరు.

ఏ విధానములోనయినను అంతర్ భాగములను గమనించుట, వాటిలోనికి విశ్వమునుండి వచ్చు ప్రవాహములను వేరుగా, నీ అంతరమునుండి వచ్చు ప్రవాహములను వేరుగా గమనించుట, ఆ తరువాత అంతర్భాగమును తెలుసుకొనుట చేయగలిగిన వారు వారి స్వంత విధానముతో వెళ్ళవచ్చును. (సాధకునికి అంతర్‌దృష్టి అంతర్‌జ్ఞానము అవసరము. దానినే ఇండివిడ్యువల్ లైన్ అంటారు. సమ్యక్ దృష్టి బాహ్యదృష్టి క్రిందకే వచ్చును. అది వారి డెవలెప్‌మెంట్‌కు అంతరాయమును కలుగజేయును.)

**pupil S.S** **M**
**for Master**
**6-10 P.M** **1-7-1910**

మిగతా . . . . . . . మా రాబోవు సంచికలో

# ఆరు ఒప్పందాలు

సమసమాజంలో ఆధ్యాత్మికత నుండి భౌతిక వాదం విడిపడి విపరీత ధోరణులతో జనప్రవాహం కొట్టుకు పోతున్న సమయంలో కావేరీ నదీతీరంలో 19వ శతాబ్దంలో జన్మించి "భక్తి రహిత తారక రాజయోగము" అనుపేర "యోగాస్కూల్ ఫ్రండ్స్ సొసైటీ"ని స్థాపించి తాను సాధన చేస్తూ 752 మంది తన అనుయాయులకు యోగదీక్షను (ఇనీసియేషన్) యిచ్చి సృష్టికార్యక్రమ వికాసాన్ని లోకానికందించిన మహనీయమూర్తి మాస్టర్ సి.వి.వి.

దాదాపు 11సం॥ల 11నెలల,11రోజులు యోగ సాధన చేసిన ఆ ఆదిపరబ్రహ్మ అవతారానికి ఆసమయంలో అందరూ సహకరించారు. ప్రత్యేకంగా వారిలో చెప్పుకోదగిన వారు వారి రెండవ కళత్రం మదర్ వెంకమ్మగారు, రెండవ వారు సుందరమ్ గారు. పరోక్షంగా చెప్పుకోదగ్గవారు యం.టి.ఎ. గారు. యం.టి.ఎ. గారి ద్వారా జరిగిన సంప్రదింపులు, సూచనలు సలహాల ద్వారా రోజువారి యోగసాధన జరిగెడిది.

లభ్యమైన మాస్టర్‌గారి సాహిత్యాన్ని గమనించినట్లయితే (ముఖ్యంగా సూచనలు) సాధకులను ఎక్కువగా ఆకర్షించేవి ఆరు ఒప్పందాలు (సిక్స్ కాంట్రాక్ట్స్) యోగారంభమయిన తరువాత సరిగా 10 సం॥ల 5 నెలలకు యం.టి.ఎ.గారు మాస్టరుగారికి యిచ్చిన సూచనలు ఈ ఆరు ఒప్పందాలు లేక ఒడంబడికలు.

ప్రశాంత సమయంలో, శరీరపు పైభాగాలకు తెలియని స్థితిలో స్థూలానికి షుమారు 2 ఫర్లాంగుల దూరం నుండి ఈ సూచన వచ్చింది. ఈ యోగ విధానంలో ఈ క్రింది ఆరు (విధానాలు) ఒప్పందాలు పనిచేస్తున్నాయి. అవి



**1. plenty of life**

కావలిసినంత జీవితం

**2. Plenty of life in conscious state in the present life**

ప్రస్తుత జన్మలోనే జాగ్రదావస్థలోనే కావలసిన జీవితం

( ట్రాన్స్ మీడియం సూచనలను ఇచ్చేది గిడ్డీనెస్ మార్గంలో. జాగ్రదవస్థలోనే పనిచేయడమనే విధానం దానికి ఉన్నప్పటికీ కొన్ని ఉన్నతమైన సూచనలు ఆ మార్గం ద్వారా రావు. కొంత కాలం వేచి చూడాలి)

**3. The present body with out decay**

ప్రస్తుత శరీరమే నశింపు లేకుండ

(నశించిపోయే సిస్టమ్‌ను నశించి పోనిదిగా చేయడం కోసం "వ్యూ" ను నింపడానికి - వసువు వచ్చని పదార్థం మొదలుకొని ఎముకల వరకు పనిచేస్తుంది. విషయాలు తెలియకపోవడం గురించి (శరీరం నశించిపోవడం గురించి) ఎలాంటి ఆందోళన అవసరం లేదు.)

**4. Without figure change**

ప్రస్తుత శరీరమే రూపు మారకుండగ

**5. Recalling the dead**

చనిపోయిన వారిని తిరిగి రప్పించడం

**6. With all conscience reacing the deluding**

అందకుండా ప్రలోభపెడుతున్న దానిని పూర్తి జాగ్రదావస్థలో చేరడం.

1,2 ఒక విధంగా కుండలినీతో ఆరంభంలో పనిచేసింది. మూడవది అకస్మాత్తుగా మాత్రమే పని చేయాలి.

4,5,6 ఆరంభంలో పని చేశాయి.

డిరెక్షన్ (క్రిందికి) మిగిలిన మూడు క్రియతో బయట పడతాయి.

డైరెక్షన్ (పోవడం) మూడు ఇంతవరకు పనిచేశాయి. డిరెక్షన్, డైరెక్షన్ ల మధ్య వర్కింగ్ డోలాయమానంగా ఉండటం మూలాన ఆరోజు మిగిలిన సమాచారం రాలేదు.

డైరెక్షన్ - ఫైర్లీ ల్యాపర్స్

డిరెక్షన్ - ప్యూర్ పెట్రోలియం

సృష్టిలో యింతవరకు పెట్రోలియం (పూర్తిగా ఏమీ మిగలకుండా తగలవడిపోయే లక్షణం కలది) ప్రవేశ పెట్టబడి యుండలేదు. సృష్టికి పెట్రోలియం మాదిరిగా ఉన్నత స్థాయిలో ఫైర్లీ ల్యాపర్స్ ఏర్పడి ఉంది. చర్మపు పై పొరకు, బయటి గాలికి మధ్య ప్యూర్ పెట్రోలియం పని చేస్తుంది. శరీరానికి 5అడుగుల ఎత్తులో ఫైర్లీ ల్యాపర్స్ పనిచేయడం మొదలు పెట్టిన తరువాత ఆవర్కు మూడు రోజులలో కంప్లీట్ అవుతుంది. అప్పటినుండి శరీరమంతా ప్యూర్ పెట్రోలియం వ్యాపించి ఆ తరువాత ప్యూర్ పెట్రోలియంను బయటి గాలిలోకి ప్రసరించేలా వర్క్ జరుగుతుంది.

ఈ ప్రపంచంలో 1,2 (డైరెక్షన్ = ఫైర్లీ లాపర్స్, డిరెక్షన్ = ప్యూర్ పెట్రోలియం ప్రేరణలను చేరవేయడం, చేరవేయక పోవడం బాహ్యంలో పనిచేయాలి. ప్రతి ఒక్క అడుగుకు 4 ఫైర్లు ఉన్నాయి. ప్రతి ఫైర్‌కు ఒక గంట వర్క్ ఉంటుంది.

ఆ మిగిలిన సమాచారం 30 నుండి 40 రోజుల తరువాత వస్తుందని అలజడిగా ఉన్న మదర్ మనస్సు చెప్పింది. అదే విషయం మాస్టరుగారు రికార్డ్ చేశారు. ఆ తేదీ తరువాత మూడు రకాలు పని చేయడం మొదలవుతుంది. కృత్తిక, పునర్వసుల మధ్య ఒక నీలం రంగు నక్షత్రం మామూలు దృష్టికి కనిపించిన తరువాత ఒప్పందం



పూర్తయినట్లు తెలుస్తుంది. అప్పుడు కుండలిని యొక్క లోపలిది, బయటిది తెలిసేలా స్పృహకు అందుతుంది.

ఈ లైన్ వర్కు యొక్క (డైరెక్ట్ లైన్) అమితమైన వత్తిడులను తట్టుకునే స్థితి భూమికి ప్రస్తుతం లేదు. కనుక భూమి ఆస్థితిని పొందటానికి కావలసిన సమయం, అది తీసుకుంటుంది. భూమి యొక్క పై భాగం, క్రింద భాగం మొత్తానికి కలిసి వచ్చేలా ఒక బెల్టు లాంటిది ఏర్పడుతుంది. అన్నివైపులనుండి లోపలికి వచ్చే వత్తిడులు భూమికి చేరాలి. దీనినే హార్స్‌కవర్ రెగ్యులేషన్ అంటారు.

ప్రస్తుతం నడిచే విధానం తప్ప, బాగా పనిచేసే విధానం ఇంకొకటి లేదని యం.టి.ఎ. ద్వారా పదే పదే మాస్టరుగారికి సూచనలు యివ్వటం జరిగింది. సాధకులెల్లప్పుడును నమ్మకముతో విశ్వాసం సడలిపోకుండా సాధన చేసినట్లయితే యం.టి.ఎ. గార్డింగ్ ఎల్లప్పుడూ ఉంటుంది. దానిలో వైఫల్యమనేదే వుండదు. వర్కింగ్ పూర్తిగా జరగలేక నెమ్మదిగా నడుస్తుండడం సాధకుని సాధననుబట్టి మాత్రమే ఉంటుంది. ప్రతిదానిలోను ఆలస్యం జరగడానికి ఇదే కారణం. డెవలప్‌మెంట్ సాధననుబట్టి మాత్రమే ఉంటుంది. దానిలో వైఫల్యమనేదే ఉండదు. ఒప్పందం తప్పక నెరవేరుతుంది.

అన్నివిధానలలోకెల్ల ప్రస్తుతం నడిచే విధానం తప్ప, బాగా పనిచేసే విధానం వేరొకటి లేదని సాధకులెప్పుడు గుర్తుంచుకొని సాధన చేయాలి.

ఒక సాధకుడు
ముప్పవరపు కాశీ విశ్వనాథం
సెల్ నెం-94 90 18 8456
గుంటూరు

# మా గురుదేవులు - మాస్టర్ జె.కె.యమ్.

జానపాటి నారాయణమూర్తి

## సాధకుడు ఎట్లా ఉండాలి?

మాస్టరుగారి నామములు మాస్టర్ యం.బి.యన్, యం.యన్. అను నెం:1 నామ జపముగ గురువుగారు ఇచ్చారు. రోజూ ఉదయం సాయంత్రం మీద **5m** చేస్తూ ఉండేవాడిని. వారి మాటననుసరించి వారు చెప్పినట్లుగ మాత్రమే చేసెడివాడను. ఏదయినా ఒక సమస్య వస్తే దాని పరిష్కారము గురించి ఆలోచించవలయునన్న, **5m** నెం:1 చేసి ఆ తరువాత కొంతసేపు కండ్లుమూసుకొని కూర్చుండి ఆలోచించి నిర్ణయము తీసుకొనమని చెప్పేవారు. ఆవిధముగ చేయుట వలన అప్పటి కంటే భిన్నముగా సమస్యను విశ్లేషించుకొనుట జరిగి మంచి పరిష్కారము దొరికెడిది. ఈ విధానముద్వారా నాఅనుభవములో చాల సార్లు మంచి సమాధానములను పొందగలిగితిని.

సాధకుడు అంటే ఎట్లా ఉండాలి? యోగములో చేరిన మొదట్లో "చెప్పింది చెయ్యాలి. చెప్పంది చెయ్యవద్దు" అని చెప్పారు. గురువుగారికి ఎదురుచెప్పటం అనేదానికి అసలు అవకాశమే ఉండదు. వారు ఏమిచెప్పినా వారు సూచనగా చెప్పినను దానిని ఆజ్ఞగా భావించి అమలు చేయాలి. కానీ ఇది చాల కష్టమైన పని. వారితో జరుపు సాధారణ సంభాషణ సమయములో అనేక మంది ఉండగా కొందరికి కొన్ని సూచనలను చేయుదురు. సూచనలను మనము గమనించుట కష్టము. గమనించినను ఆచరించుట ఇంకా కష్టము. కానీ సూచనలు చేసినవారికి తెలుసు, తాను ఎవరికి ఏమి సూచనలను చేసినది. మనము వాటిని నిర్వర్తించినది నిర్వర్తించనిది గమనిస్తూ ఉంటారు. మనము వారి సూచనను గుర్తించి అనుసరిస్తూ ఉంటే ఆ సూచనను నిర్వహించుటకు అవసరమైన శక్తి సామర్థ్యములు అందుచూ ఉండును.

నేను ప్రతి గురువారం నరసరావుపేట వెళ్ళి వారిని కలిసి రోజంతా



ఉండి వారితో పాటు సాయంత్రం జనరల్ ప్రాక్టీస్ చేసుకొని వస్తూ ఉంటాను. మాగురువుగారితో నాకుగల నాసహచర్యకాలంలో ఒకే ఒక్కసారి ఒక పోస్టుకార్డు వ్రాసారు. నేను నరసరావుపేట వెళ్ళి వచ్చిన రెండు మూడు రోజులకు వచ్చినది. వారు ఆ కార్డులో నీవు రోజూ "సింపతెటిక్ కోఆపరేషన్", "న్యూ ప్రిన్సిపుల్"నామములను ప్రతిరోజూ రోజుకు ఒక్కసారి రెగ్యులర్‌గా చెయ్యి అని వ్రాసారు. ఉత్తరము చూచాను. గురువుగారి సంతకము ఉన్న ఉత్తరము అని పవిత్రంగా దాచిపెట్టుకున్నాను. తరువాత వచ్చిన గురువారం ఉదయం, నరసరావుపేట వెళ్ళాను. వారు నన్ను చూడగనే ఉత్తరం అందిందా అని అడిగారు. అందింది అని సమాధానం చెప్పాను. కొద్ది సంభాషణ గడచిన తరువాత రోజూ ఆనామములు ప్రాక్టీస్ చేస్తున్నావా? ఎట్లా ఉన్నది అని అడిగారు. ఇంకా మొదలు పెట్టలేదండి, మొదలు పెడతాను అని అన్నాను. దానికి వారు ఉత్తరం అందిన వెంటనే మొదలు పెట్టాలి, "రెండవసారి చెప్పించుకునే వాడివి నువ్వేం సాధకుడివయ్యా!" అని అన్నారు. అప్పటినుండి వారు సూచనగా చెప్పిన ఏ విషయాన్నయినా ఎంతో వినయ విధేయతలతో ఆచరించేవాడిని. వారి దగ్గర ఉన్నంతసేపు వారు నాకోసం ఏమి చెబుతారా అన్నట్లు గమనికతో ఉండేవాడిని.

నరసరావుపేటలో ఉన్నప్పుడు ఒకసారి వారు చెప్పిన టైమ్‌కు ఒక నిముషం ఆలస్యంగా వెళితే "నిముషం ఆలశ్యంగా వచ్చావు" అని అన్నారు. వారు సాధకుని సిన్సియారిటీని, పంక్చ్యుయాలిటీని గమనిస్తూ ఉండేవారు. వారితో ఎక్కువ సమయం గడపాలని ఉండేది. ఎక్కడ మన లోపాలు గమనిస్తారో అని భయంగా కూడా ఉండేది. "వెంటిలేటర్ ఏమాత్రం తెరిచినా ఇల్లంతా కనబడుతుంది, అని ఒకసారి అన్నారు. "లోపల ఉండి చూచేవాడిదగ్గర మనం ఏమి దాచగలం" వట్టి భ్రమగాని అని అనేవారు. "అన్నీ తెలిసినా తెలియనట్లు ఉండాలి" ఇది చాల కష్టము అని అన్నారు.

మా గురువుగారు ఒక రోజు పిడుగురాళ్ళ వచ్చారు. వారు వస్తూనే దాచేపల్లి వెళ్ళాలి వెళదామా అని అన్నారు. వారు వచ్చిన తరువాత కొంత

సేపటికి వారికి మాపిల్లవాడు సాందీప్ నీళ్ళ విరోచనలతో బాధపడుచున్నాడని చెప్పాను. వారు వెంటనే "ఎలక్ట్రాల్ పౌడర్" నీళ్ళలో వేసి ఇవ్వు అన్నారు. సరేనండి అని చెప్పి వాడికి ఎలక్ట్రాల్ పౌడరు నీళ్ళలో కలిపి ఒక సారి ఇచ్చి మరి రెండు సార్లు ఇవ్వమని మాఆవిడ శారదకు చెప్పి గురువుగారిని దాచేపల్లి తీసుకొని వెళ్ళాను. దాచేపల్లినుండి 2గం॥లకల్లా తిరిగి వచ్చాము. వారు మాఇంట్లో భోజనము చేసి విశ్రాంతి తీసుకొని సాయంత్రం ఆశ్రమంలో జనరల్ ప్రాక్టీస్ చేసుకొని తిరిగి నరసరావుపేట వెళ్ళారు. మేము దాచేపల్లి నుండి వచ్చేటప్పటికే పిల్లవాడి విరోచనాలు తగ్గిపోయాయి.

ఇక్కడ జరిగినది ఏమిటంటే గురువుగారి మాటను ఎదురు మాటాడక ఆచరించుట. మేము వాడికి విరోచనములుతగ్గుట కొరకు మూడు రోజులనుండి మందులు వాడుచున్నాము. ఎలక్ట్రాల్ నీళ్ళు ప్రతి రోజూ పోస్తునే ఉన్నాము. వారు "ఎలక్ట్రాల్ నీళ్ళు" పోయమని చెప్పినప్పుడు, మేము మూడురోజులనుండి పోస్తునే ఉన్నాము అని సాధారణముగా ఎవరమైనా అంటాము. నాకు వారితో గల గత అనుభవము వల్ల వారి మాటకు అడ్డుగా సమాధానం చెప్పకుండా వారు చెప్పిన సలహాతో పాటు వారి మాటతో వచ్చిన స్పిరిచ్యువల్ ఫోర్స్ పనిచేయుట వలన ఫోర్స్‌కు గల స్వస్థత చేకూర్చుతనము పనిచేసి వెంటనే రిలీవ్ వచ్చినది. వారిమాటకు అడ్డుతగలకుండా వారుచెప్పినట్లు చేయుట సాధకుడు చేయవలసిన పని. వారు మొదట చెప్పిన సలహాకు అడ్డుతగిలినతరువాత వారుచెప్పే మాటలకు స్పిరిచ్యువల్ పవర్ అనుసరించదు. మనము గమనించినట్లయితే సర్వ సాధారణముగా మనము ఎవరి సలహాకయినా "అట్లాకాదు అంటూ" అడ్డుపడతాము. కానీ గురువుగారివద్ద ఆవిధంగా అడ్డుమాటలు చెప్పరాదు. వారి సలహా మనకు చూచుటకు అనుసరించుటకు ఆమోదయోగ్యము కాకపోయినను భారము వారిమీద ఉంచి దానిని ఆచరించిన ఖచ్చితముగా ఆసలహా ఉత్తరోత్తర మనకు మేలేచేయును. ఇది నా స్వానుభవము.

మిగతా . . . . . మారాబోవు సంచికలో



# గ్రంధ పరిచయము

"మహాపురుష మాష్టరు యం.యన్." అనుగ్రంధ పరిచయం.

ఈగ్రంధమును దామరాజు వెంకటహనుమంతరావు గారు వ్రాసి యున్నారు. ఈగ్రంధమునందు ఒంగోలుమాష్టరుగారి గురించి అన్ని కోణములలో చాలా విపులంగా వివరించారు. నిజంగా ఈగ్రంధము వ్రాయడం అన్నది భగవంతుని ఆనుజ్ఞ ఉంటేగాని సాధ్యపడదు. ఇది చాలా కష్ట సాధ్యమైనపని. ఎందుకంటే మామూలుగా సాహిత్యపరంగా కావ్యాలు వ్రాయడం అంటే మనమేధస్సుకు పదునుపెట్టడం అవుతుంది. మరీ గోప్యంగా తపస్సు చేసుకుంటున్న, చాల కాలం క్రితం శరీరం వదిలిన దివ్యమూర్తుల జీవితచరిత్రల గురించి వ్రాయడం ఆషామాషి వ్యవహారం కాదు. నిజంగా కత్తిమీద సామే. ఎందరినో కలవాలి, వారువారికి సమకాలికులై ఉండాలి, వారికి నేరుగాపరిచయం ఉన్నవ్యక్తులైతేనే ఆగ్రంధం పూర్తి అవుతుంది, మనంకూడా ఆవ్యక్తి యొక్క కుటుంబంతో, వారిసన్నిహితులతో, స్నేహితులతో సంప్రదించి మౌఖికంగా అందిన విషయాలు మాత్రమే లిఖించాలి. ఆందులో కల్పనలకుతావులేదు. ఈవిషయంలొ నిజంగా దామరాజువారు కృతకృత్యులయ్యారు.

ఇంక గ్రంధవిషయంలో ఇందులో కవర్‌పేజీ యమ్.యన్. గారి చిత్తరువు తో చాల అకర్షణీమంగా ఉన్నది. చివరిపేజి యమ్.యన్. గారి ఒంగోలులోని వారు నివసించిన భవనం చిత్తరువుతో యున్నది.

గ్రంధంలోని పేజిలు.232

రెండవపేజీలో సీ.వి.వి. గారి యోగా సింబల్‌తో, తరువాతపేజిలో సి.వి.వి.గారి పాదుకలు కలిగిన చిత్తరువు కలదు. తరువాత పేజిలో యమ్.యన్. గారిఫోటో, డిక్లరేషన్ బై మాష్టర్ యమ్.యన్. ఉన్నవి. తరువాత సి.వి.వి వారి ఫోటో, తరువాత యమ్.యన్. గారిపోటో తరువాత శ్రీహనుమంతరావు దంపతుల ఫోటో కలవు.

తరువాత కోవెలప్రసన్న గారి పీఠిక కలదు.

6 పేజిలలో కంభంపాటి పార్వతీకుమార్ గారి ఆశిస్సులతో కలదు. చివరలో దామరాజు వారు 10 పేజిలలో వారి బావములను వ్రాసియున్నారు.
కుమార్తెలు, వ్రాసిన ప్రసంగములుకలవు. మొత్తం 214 పేజీలలో 29 పీఠికలుగా కలదు.

మొదటి భాగము

ఈవిభాగము 43 సబ్జక్ట్ హేడ్డింగులతో కలదు.
ఇందులో మైనంపాటివారి వంశం పుట్టుపూర్వోత్తరాలు
మైనంపాడు గ్రామచరిత్ర ఫోటో లతోచాలచక్కగా వర్ణించియున్నారు శివాలయం, వేణుగోపాలస్వామి దేవాలయ ముఖద్వారము ఫోటోలతొ వివరించారు.
జననము - బాల్యము - విద్యాభ్యాసము 8,9,10 పేజిలలో వర్ణించియున్నారు
జననము 25-08-1883 నెల్లూరుజిల్లా నాయుడుపేట లో, వీరితల్లి తండ్రులు మైనంపాటి శేషయ్య - రంగమ్మ దంపతులు.
వీరినామధేయము జ్వాలానరసింహము, వీరుప్రకాశంపంతులుగారి మేనల్లుడు ప్రకాశంపంతులుగారికి మేనల్లుడనిన అమితప్రేమ, వీరికివిద్యాభ్యాసములో, వృత్తిలో సలహాలిస్తుండేవారు.
1950 లో మద్రాసు విశ్వవిద్యాలయంనుండి బి.ఎ. పట్టా పొంది యున్నారు
కళ్యాణము రంగనాయకమ్మతొ దవళేశ్వరం లోని లక్ష్మిజనార్దనస్యామి వారి దేవాలయంలొ జరిగింది.
ప్రధమసంతానం 1909లో - లక్ష్మినరసమ్మగారు
ద్వితీయసంతానం - 1913 లో శ్రీనివాసం
**త్రుతీయసంతానం - శేషు**
**చతుర్దసంతానం-హ్రుషికేశఅప్పారావు,తరువాత దాసు, దామోదరావు, సావిత్రి, శారదా జన్మించారు.**



# యం.యన్. గారి యోగప్రవేశం

వీరి చినమామ టంగుటూరిప్రకాంపంతులుగారితమ్ముడు జానకిరామయ్యగారు. వీరు ట్రిప్లి కేన్‌లో యస్.నారయణ్ అయ్యర్ వారికి మంచి స్నేహితులు. వీరు జానకిరామయ్యను వారిగురుదేవులు మాస్టర్ సి.వి.వి గారిదర్శనం చేయించగా జానకిరామయ్యగారికి 10-08-1918లో 614వ మీడియంగా మాస్టరుగారు ఉపదేశం ఇచ్చారు. వీరు ఉభయసంధ్యలలో ఉ6గం॥లకు సా6గం॥లకు మౌనంగా యోగాభ్యాసం చేయడం గమనించిన యమ్.యన్ గారికి తాను అలాంటి యోగాబ్యాసం చేయాలని కుతుహాలం ఏర్పడ్డది. 1919 డిసెంబరు 21వతేదిన కుంభకోణం బయలుదేరి 22వతేదిన కుంభకోణంచేరుకున్నారు. జానకిరామయ్యగారు వీరివెంట ఉన్నారు. వీరికి జానకిరామయ్యగారు ఇది భృక్తరహితతారక రాజయోగమని అదిష్టానదైవం మాష్టరు సి.వి.వి అని వీరు సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపులని నిర్గుణబ్రహ్మము సగుణములోనికివచ్చి కుంభకోణం లో మాస్టరు సి.వి.వి గా అవతరించారని బక్తి శ్రద్దలతో 10సంవత్స రములు చేపినవారిని తనంతవారినిగా చేస్తారని చెప్పగా విని 1919 డిసెంబరు 23న జనరల్ కాల్ సమావేశములలో జానకిరామయ్యగారు మాస్టరు సి.వి.వి గారికి పాదాబివందనం చేస్తుంటే ప్రక్కనున్న నరసింహంగారు వీరిదివ్యమంగళస్వరూపాన్ని దగ్గరనించి దర్శించి పులకరించిపోయారు.

తరువాత జానకిరామయ్యగారు మాస్టరుగారి గురించి పరిచయంచేయుగా ఔను ఇతనికోసమే చూస్తున్నాను. రావడం ఆలస్యమైనదేమిటి అంటు ప్రశ్నించారు. తరువాత నీకు ఏమికావాలి అనిప్రశ్నించారు. దానికివారు మనశ్శాంతి అన్నారు. వెంటనే వారు గ్రాంటెడ్ అన్నారు.

యమ్.యన్ గారు యోగంలో చేరుట జరిగినది. దానినే ఇన్సియేషన్ అంటారు. కుంభకోణంలో యోగంలోచేరాలంటే చాలాప్రోసీజర్ ఉంది. ఇప్పటిలాగ కాదు. ఇప్పుడు ఏముంది ఎవరైనా వచ్చి యోగంలో చేరాలంటే వెంటనే చేర్చుకోవడంజరుగుతన్నది. కొందరైతే వచ్చినవారు ఎక్కడ జారిపోతారో అని వారివెంట పడుతున్నారు. వారిలో చాలామందికి చేరినప్పుడు ఉండే శ్రద్ధ తరువాత ఉండటములేదు. చేరేవారు కూడా ఆరోగ్యంకోసంచేరడం, తమప్రక్కనున్న వారుచేరారనో యోగంగురించి సరైన అవగాహనలేకే రావడం జరుగుతున్నది. వారందరు ఈవృత్తకం తప్పకచదువవలయును. మాష్టరు సి.వి.వి గారు యమ్.యన్. గారితో మిష్టర్ యమ్.యన్ ఇరోజుసాయంత్రం నీకు ఇన్సియేషన్ ఇస్తాను అంటూ రాధకృష్ణపిళ్ళే, మహదేవయ్యర్ లవైపు దృష్టిసారించి రేపు ఇతనికి టెమ్పటీసి చూవండి అన్నారు. యమ్.యన్ గారుప్రవేవపత్రం, కావలపిన సామగ్రి తీసుకొని యోగపాఠశాలలో సాయంత్రం 4గంటలకు మాష్టరుగారి పాదాలచెంత ఉంచి గురుదేవులు మాష్టరుసి.వి.వి గారికి పాదాభివందనం చేశారు. ఆవెంటనే యమ్.యన్ గారిని "శవాననమున వరుండి నమస్కరించుకో" అన్నారు. అలా చేయగానే ఉపదేశమంత్రమును చెప్పి కళ్ళుమూసుకొని నీలో ఏమిజరుగుతుందో గమనించ మనిచెప్పారు. కళ్ళుతెరవాలన్నా తెరువలేవు అనిచెప్పి వారు గదిలోకివెళ్ళారు. శరీరంలో జరుగవల సినదంతా జరిగినతరువాత వారికళ్ళుతిరిగి తెరిపిడిపడ్డాయి.

మిగిలిన విషయములు మా రాబోవు సంచికలో

పరిచయకర్త

అక్కిరాజు అచ్యుత రామశర్మ



## ప్రత్యేక సాధన దినములు

పిడుగురాళ్ళ యోగాస్కూల్ లో యోగసాధనకు పాటించు ప్రత్యేక సాధన దినములు. సూర్యోదయం సమయములో ఉన్న తిథిని ఆరోజు తిథిగా తీసుకొనుట జరిగినది. ఈ క్రింది రోజులలో ప్రత్యేకముగా అయా కోర్సులను చేయుదుము. ప్రతి రోజూ తిథి, వార, నక్షత్ర, రాశులకు సంబంధించిన నామములను చేయుట జరుగును.

| | | | |
|---|---|---|---|
| మొదటి పౌర్ణమి అమావాస్య కోర్సులు | చైత్రం | శ్రావణం | మార్గశిరం |
| రెండవ పౌర్ణమి అమావాస్య కోర్సులు | వైశాఖం | భాద్రపదం | పుష్యం |
| మూడవ పౌర్ణమి అమావాస్య కోర్సులు | జ్యేష్టం | ఆశ్వయుజం | మాఘం |
| నాల్గవ పౌర్ణమి అమావాస్య కోర్సులు | ఆషాఢం | కార్తీకం | ఫాల్గుణం |

05-03-2015 గురువారం పౌర్ణమి - 4వ-ఫుల్ మూన్ కోర్స్
18-03-2015 బుధవారం ధనిష్ట నక్షత్రం
20-03-2015 శుక్రవారం అమావాస్య - 4వ-న్యూ మూన్ కోర్స్
20-3-15 సూర్యగ్రహణం- బిగిన్-13-11; మిడిల్-15-15; ఎండ్ - 17-20
21-03-2015 శనివారం ఈక్వినాక్స్ డే కాన్ఫరెన్స్
25-03-2015 బుధవారం అరుంధతి రెగ్యులేషన్స్
04-04-2015 శనివారం పౌర్ణమి - 1వ-ఫుల్ మూన్ కోర్స్
04-04-2015 చంద్రగ్రహణం-బిగిన్-15-47; మిడిల్-17-30; ఎండ్-19-14
14-04-2015 మంగళవారం ధనిష్ఠ నక్షత్రం
18-04-2015 శనివారం అమావాస్య - 1వ-న్యూ మూన్ కోర్స్
21-04-2015 మంగళవారం అరుంధతి రెగ్యులేషన్స్
04-05-2015 సోమవారం పౌర్ణమి - 2వ-ఫుల్ మూన్ కోర్స్
12-05-2015 మంగళవారం ధనిష్ఠ నక్షత్రం
18-05-2015 సోమవారం అమావాస్య - 2వ-న్యూ మూన్ కోర్స్
02-06-2015 మంగళవారం పౌర్ణమి - 2వ-ఫుల్ మూన్ కోర్స్
08-06-2015 సోమవారం ధనిష్ఠ నక్షత్రం
16-06-2015 మంగళవారం అమావాస్య - 2వ-న్యూ మూన్ కోర్స్